నేటి కందం- నేటికి అందం

ప్రవిమలమగు పక్షమ్ములు
వివిధములగు సీమలందు విజయము నొందన్
రవళించె ప్రజాస్వామ్యము
సవరించిన గమకముగ ప్రజావిజయముగన్ !!

(వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో వివిధ పార్టీలు విజయం సాధించడం ద్వారా ఇది ప్రజాస్వామ్య విజయంగా ప్రజా విజయంగా ఓటరు ప్రపంచం అభివర్ణించింది.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

తొలిగింపు ఓట్లతోనే
తృణమూల్ కు బ్రేకప్పా
ఢీకొడితేనే సినీ క్రేజ్
డీఎంకేకు లాకప్పా
ఎన్నికల్లో ఊహించని
ఎన్నెన్నో మలుపులు
ప్రభుత్వాల వ్యతిరేకత
ప్రభావాల గెలుపులు

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ బుధవారం 6-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:207 పేజీలు:6 వెల: రూ.1/-


## యూఏఈపై ఇరాన్ దాడులు.. ఖండించిన ప్రధాని మోదీ.. ఆమోదయోగ్యం కాదని ప్రకటన



న్యూఢిల్లీ, మే 5: యూఏఈలోని ఫ్యుజైరా ఆయిల్ హబ్‌పై ఇరాన్ దాడులు జరిపిన సంగతి తెలిసిందే. ఇరాన్ జరిపిన డ్రోన్ దాడుల్లో ముగ్గురు భారతీయులు గాయపడ్డారు. ఈ ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. సోషల్ మీడియా వేదికగా దాడుల్ని ఖండిస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

"యూఏఈలోని ఫ్యుజైరా ఆయిల్ హబ్‌పై ఇరాన్ జరిపిన దాడుల్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ దాడుల్లో ముగ్గురు భారతీయులు గాయపడ్డారు. పౌరుల్ని, సాధారణ నిర్మాణాల్ని లక్ష్యంగా చేసుకుని దాడులు జరపడం ఆమోదయోగ్యం కాదు. ఈ క్లిష్ట సమయంలో యూఏఈకి ఇండియా మద్దతుగా ఉంటుంది. ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యల్ని పరిష్కరించు కునేందుకు చర్చలు, దౌత్యపరమైన మార్గాలే ముఖ్యమని ఇండియా మరోసారి చెబుతోంది. ఈ ప్రాంతంలో శాంతి ప్రక్రియ కోసం హోర్ముజ్ నుంచి నిరాటంకమైన, సురక్షితమైన ప్రయాణం అవసరం. అప్పుడే ఇంధన భద్రత కోసం ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం సాధ్యమవుతాయి" అని మోదీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

మరోవైపు ఈ దాడుల్ని ఖండిస్తూ అంతకుముందు భారత విదేశాంగ శాఖ కూడా ఒక ప్రకటన చేసింది. ఇలాంటి దాడులు సరికాదని పేర్కొంది. యూఏఈలోని ఆయిల్ హబ్‌పై ఇరాన్ దాడి చేయగా, ముగ్గురు భారతీయ కార్మికులకు గాయాలయ్యాయి. వారికి తగిన వైద్య సేవలు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని అక్కడి భారతీయ రాయబార కార్యాలయ అధికారులు ప్రకటించారు. ఒకపక్క కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ ఇరాన్ ఈ దాడి చేయడం విశేషం.

## తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం 7న

చెన్నై, మే 5:తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన తమిళగ వెట్రి కళగం పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహకాలు చేస్తోంది. పార్టీ అధినేత విజయ్ శాసనసభాపక్ష నేతగా ఎన్నిక కావడంతో ఈనెల 7న కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ప్రమాణస్వీకర కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నాయి.

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అనూహ్యంగా 108 స్థానాల్లో విజయం సాధించినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 118 సీట్లను దక్కించుకోలేకపోయింది. మెజారిటీకి మరో 10 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం ఉంది. టీవీకే సారథ్యంలోని ప్రభుత్వానికి మద్దతిచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సుముఖంగా ఉందని వినిపిస్తోంది. వామపక్ష పార్టీలు సైతం టీవీకే నేతలతో సంప్రదింపులు సాగించనున్నట్లు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్-5, వీసీకే-2, సీపీఐ-2, సీపీఎం-2 సీట్లు గెలుచుకున్నాయి. ఐయూఎంఎల్, డీఎండీకే, పీఎంకే పార్టీలను నుంచి కూడా టీవీకేకు మద్దతు లభించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

కాగా, ప్రభుత్వం ఏర్పాటుకు తమను ఆహ్వానించాల్సిందిగా గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌కు విజయ్ మంగళవారంనాడు లేఖ రాసినట్టు తెలుస్తోంది. మెజారిటీ నిరూపించుకునేందుకు రెండు వారాలు గడువివ్వాలని ఆ లేఖలో కోరినట్టు సమాచారం. మరోవైపు, ఓటమి నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన పదవికి రాజీనామా చేశారు. గవర్నర్‌ను కలిసి రాజీనామా పత్రాన్ని సమర్పించారు.

## హైదరాబాద్‌కు అంతర్జాతీయ దిగ్గజం బీఏఎస్ఎఫ్ రాక

హైదరాబాద్, మే 5: హైదరాబాద్‌లో జర్మనీకి చెందిన అంతర్జాతీయ దిగ్గజం బీఏఎస్ఎఫ్ గ్లోబల్ సర్వీస్ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. ఃయాఈతో తెలంగాణ ప్రభుత్వానికి కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 3,000 మందికి కొత్త ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకు ఃయాఈ ప్రతినిధులు లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందజేశారు. ఈ సందర్భంగా ఃయాఈ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించనున్నట్లు ప్రకటించారు. ఈ హబ్ ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్ సేవలకు వ్యూహాత్మక కేంద్రంగా పని చేయనుంది.





గ్లోబల్ సర్వీస్ డెలివరీ నెట్‌వర్క్‌కు హైదరాబాద్ కీలక కేంద్రంగా మారనుంది. 160 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ అంతర్జాతీయ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 200 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్‌లో భారీ పెట్టుబడి ద్వారా తన సేవలను మరింత విస్తరించనుంది. తెలంగాణలో మరో మెగా గ్లోబల్ కంపెనీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడంపై ప్రభుత్వం సంతోషం వ్యక్తం చేసింది. హైదరాబాద్‌పై అంతర్జాతీయ కంపెనీల నమ్మకం మరింత పెరుగుతోందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

## బీసీ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంది: వీహెచ్

హైదరాబాద్, మే 05: బీసీ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో మాట్లాడిన ఆయన, ఈ నెల 9వ తేదీన ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని ప్రకటించారు. 'బీసీ హక్కుల కోసం ప్రాణం పోయినా సరే పోరాడుతా' అని స్పష్టం చేసిన వీహెచ్.. బీజేపీ బీసీ ఎంపీలు ఈ అంశంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.



'అంబేద్కర్‌ను మా దేవుడిగా భావిస్తాం. అలాంటి మహనీయుడిని కూడా అవమానించే విధంగా పరిస్థితులు ఉన్నాయి' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా జరుగుతున్న జనగణనలో బీసీల ప్రస్తావనే లేకపోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'బీసీలు ఓట్లు వేయడం లేదా? వారి సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదు?' అని వీహెచ్ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు లేఖలు రాసినా స్పందన రాలేదని వీహెచ్ ఆరోపించారు.

బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందని తెలిపారు. ముఖ్యమంత్రి కూడా ధర్నాలు జరిగినప్పటికీ బీసీ సమస్యలపై కేంద్రం వైఖరిలో మార్పు రాలేదని వీహెచ్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే తాను నిరాహార దీక్షకు దిగుతున్నట్లు ప్రకటించారు. వీహెచ్ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో బీసీ అంశం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.

## జూబ్లీహిల్స్ బాలికల ట్రాప్ కేసుపై సజ్జనార్ స్పెషల్ ఫోకస్

హైదరాబాద్, మే 5:జూబ్లీహిల్స్ బాలికల ట్రాప్, చీటింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఇద్దరు అన్నదమ్ములు.. 19 మంది మైనర్లను ట్రాప్ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. నిందితులను విచారించామని.. ఈ విచారణలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లో మూడుగంటల పాటు నిందితులను సీపీ ప్రశ్నించారు. అర్జున్ అలియాస్ చంద్రశేఖర్ ఆజాద్, ప్రవీణ్‌లను అరెస్ట్ చేసి కస్టడీకి తీసుకున్నట్లు చెప్పారు.

రిచ్ కిడ్స్‌ను అర్జున్, ఆయన సోదరుడు ప్రవీణ్ టార్గెట్ చేశారని సజ్జనార్ వెల్లడించారు. మైనర్లను ట్రాప్ చేసి ఖరీదైన కార్లలోనే లైంగిక చర్యలకు అర్జున్ పాల్పడ్డాడని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎస్మార్ట్‌గా ఉంటూ మైనర్లకు వల విసిరారని చెప్పారు. అర్జున్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో 150 మంది అమ్మాయిలు ఫాలో అవుతున్నారన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రస్తుతం అర్జున్ ప్రొఫైల్‌ను తాము లాక్ చేశామని తెలిపారు. ఇద్దరు నిందితులకు వారి తల్లి మీనాకుమారి కూడా సహకరించినట్లుగా గుర్తించామని అన్నారు. నిందితుల కుటుంబం గుంటూరుకు చెందినదిగా తమ దర్యాప్తులో తేలిందన్నారు. బాలికలు అట్రాక్ట్ అయ్యేలా ఇన్‌స్టాగ్రామ్‌లో అర్జున్ రీల్స్ చేశాడని అన్నారు.

అక్కడి నుంచి బాలికలను ట్రాప్ చేసి రిచ్‌గా కారులో షికారు అంటూ హైదరాబాద్ రోడ్లపై అర్జున్ అన్నదమ్ములు తిప్పారని చెప్పారు. తమతో ఫిజికల్ రిలేషన్ పెట్టుకునేలా బాలికలపై ఒత్తిడి చేశారన్నారు. ఆ వీడియోలను కూడా నిందితులు రికార్డు చేశారని.. సమయం చూసి తాము ఓ బిజినెస్ మొదలుపెడతామని బాధితులను నమ్మించి డబ్బు అడిగేవారని తెలిపారు. అలా ఓ బాలిక ఇంట్లో తెలియకుండా రూ. 13 లక్షలను నిందితులకు ఇచ్చిందన్నారు. గత ఏడాది కూడా ఇలాగే మరో మైనర్‌ను అర్జున్ ట్రాప్ చేశారని తెలిపారు. ఈ కేసులో మూడు రోజుల పాటు జైల్లో ఉండి ఆయన బయటకు వచ్చారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

## కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతుందో చెప్పాలి: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, మే 05: కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతిపై సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతుందో సమాధానం చెప్పాలని తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మే 10వ తేదీన ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించనున్నారని.. ఆ లోపు దీనిపై స్పష్టత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.

మంగళవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో సీబీఐ దర్యాప్తుపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. బండి సంజయ్ కేంద్ర మంత్రి అనే ఫీలింగే రావటం లేదని చెప్పారు.

గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ. వేల కోట్ల అవినీతికి పాల్పడిందని విమర్శించారు. అలాగే రూ. వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ అవినీతిపై కిషన్ రెడ్డి, బండి సంజయ్ పలుమార్లు ఆరోపణలు చేశారని.. అలాగే సీబీఐ విచారణను కోరారని గుర్తు చేశారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చ పెట్టి 8 నెలల క్రితం ఈ కేసును సీబీఐకు బదిలీ చేశామని పేర్కొన్నారు.

బండి సంజయ్.. చేతిలోని తుపాకీ కాల్చకుండా కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే లాభం ఏమిటి.. అంటూ టీపీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నించారు. బండి సంజయ్ లోపాయికారీ ఒప్పందంలో ఉండి ఈ దర్యాప్తునకు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతు లేకుండానే బీజేపీకి ఓట్లు పడ్డాయా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. ఎంపీ సీట్లకి కృతజ్ఞతగా 8 నెలలుగా జరగాల్సిన సీబీఐ దర్యాప్తును అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ కేసు విచారణ ఆలస్యం ఎందుకు అవుతుందో కేంద్ర మంత్రులు సమాధానం చెప్పాలని టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు.

రైతుల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ గతంలో అన్న మాటలు ప్రజలు మర్చిపోలేదన్నారు. రైతులు, పేద ప్రజలకు లాభం చేసిన ప్రభుత్వం తమదే అని చెప్పారు. ధాన్యం కొనుగోలు చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. పంటల దిగుబడులు కూడా పెరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా రైతులకి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలతో కాంగ్రెస్ ముందుకు పోతుందన్నారు.

ఓట్ల చోరీ వల్లే బీజేపీ గెలిచింది..

బెంగాల్‌లో బీజేపీకి అనుకూల పరిస్థితులు లేవన్నారు. అక్కడ బీజేపీ గెలిచిందంటే.. అది ఓట్ల చోరీ వల్ల మాత్రమే అని టీపీసీసీ చీఫ్ కుండబద్దలు కొట్టారు. బెంగాల్‌లో ఓటు చోరీ జరిగిందని ఆరోపించారు. తెలంగాణలో కూడా అదే పరిస్థితి జరగొచ్చు అంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

ఓటు హక్కు కాపాడుకోవాలంటూ తెలంగాణ పౌరులకు ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. అయినా తెలంగాణలో అలాంటి ఆటలు సాగవు అని పేర్కొన్నారు. సర్ పేరిట ఓట్లు దొంగలించడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు.

## రౌడీ షీటర్‌ను అడ్డుకున్న ఆటో డ్రైవర్.. సన్మానించిన సీపీ సజ్జనార్



హైదరాబాద్, మే 5: ఓ సామాన్య ఆటో డ్రైవర్ అసామాన్య ధైర్య సాహసాలు ప్రదర్శించాడు. మహిళ మెడలో గొలుసు లాక్కుని పారిపోతున్న రౌడీ షీటర్‌ను తన ఆటో సాయంతో అడ్డుకున్నాడు. కత్రితో దాడి చేస్తున్నా బెదరకుండా అతడిని పట్టుకున్నాడు. రౌడీ షీటర్ అరెస్ట్ అవ్వడానికి ఎంతో కృషి చేశాడు. ఆటో డ్రైవర్ ధైర్యసాహసాలకు సరైన గుర్తింపు దక్కింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆటో డ్రైవర్‌ను సన్మానించారు. ఆ పూర్తి వివరాల్లోకి వెళితే.. మార్చి 4వ తేదీ తెల్లవారుజామున బేగం బజార్ జిన్సీ చౌరాహా ప్రాంతంలో మంజు ఓమ్లతా తన కోడలితో కలిసి మార్నింగ్ వాక్‌కు వెళ్లారు.

హిందీ మర్వాడీ విద్యాలయ స్కూల్ వద్ద ఊహించని పరిణామం చోటుచేసుకుంది. డబీర్‌పుర్‌కు చెందిన రౌడీ షీటర్ మహ్మద్ సోహేల్ ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలో అతడి స్కూటీ అదుపుతప్పి కింద పడిపోయింది. బాధితురాలు గట్టిగా కేకలు వేసింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ సైడ్ వ్యూ మిర్రర్ ద్వారా ఆ దృశ్యాన్ని చూశాడు. వెంటనే ఆటోను రివర్స్ చేశాడు. రౌడీ షీటర్ స్కూటీని పైకి లేపి అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. జాహెర్ ఆటోతో స్కూటీని ఢీకొట్టాడు. దీంతో మహ్మద్ సోహేల్ కిందపడిపోయాడు. జాహెర్ వెంటనే కిందకు దిగి సోహేల్‌ను పట్టుకున్నాడు. తర్వాత అటు వైపు వెళుతున్న వారు కూడా జాహెర్‌కు సాయం చేశారు. రౌడీ షీటర్‌ను పోలీసులకు పట్టించారు. అనంతరం జాహెర్ అక్కడినుంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఎలాంటి ప్రతిఫలం ఆలోచించకుండా.. తన ప్రాణాల కు తెగించి రౌడీ షీటర్‌ను పోలీసులకు పట్టించిన జాహెర్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ మంగళవారం బంజారా హిల్స్, టీజీఐసీసీసీలోని తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా సన్మానించారు. ప్రశంసా పత్రంతో పాటు నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో గోల్కొండ జోన్ డీసీపీ జీ చంద్ర మోహన్, గోషామహల్ ఎస్‌హెచ్‌ఓ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఒకేరోజు 6 ప్రాంతాల్లో హైడ్రా దాడులు.. అక్రమ యూనిట్లపై ఉక్కుపాదం

హైదరాబాద్, మే 5:హైదరాబాద్‌లో అక్రమ మైనింగ్, క్రషింగ్ యూనిట్లు, ఖీఓఅ ప్లాంట్లపై హైడ్రా కఠిన చర్యలు చేపట్టింది. ఒక్క రోజులోనే 6 ప్రాంతాల్లో హైడ్రా ఆపరేషన్లు నిర్వహించి, అక్రమ యూనిట్లపై దాడులు చేసి కూల్చివేతలు చేపట్టింది.

గండిపేట మండలం వట్టినాగులపల్లి, శేరిలింగంపల్లి మండలంలోని గౌలిదొడ్డి విలేజ్, శంషాబాద్ మండలం కొత్వాల్ గూడలో హైడ్రా బృందాలు దాడులు నిర్వహించాయి. ఈ ఆపరేషన్లలో 6 క్రషింగ్ యూనిట్లను తొలగించగా, 12 RMC ప్లాంట్లను కూల్చివేశారు.

పీసీబీ, మైనింగ్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ల ఫిర్యాదు మేరకు హైడ్రా ఈ చర్యలు చేపట్టింది. సంబంధిత శాఖల ఆధ్వర్యంలోనే కూల్చివేతలు జరిగాయి. అక్రమ మైనింగ్, క్రషింగ్, ఆర్ఎంసీ ప్లాంట్లతో వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి అక్రమ యూనిట్లు గండికొడుతున్న పరిస్థితి. బడాబాబుల అండతో మైనింగ్, క్రషింగ్, RMC ప్లాంట్లు నడుస్తున్నట్లు సమాచారం. బడాబాబుల పైరవీలతో నడుస్తున్న యూనిట్లపై ఆయా శాఖల ఫిర్యాదులతో హైడ్రా కఠిన చర్యలు తీసుకుంటోంది.

## కేంద్ర ఎన్నికల సంఘమే ప్రధాన విలన్.. మమతా బెనర్జీ

కోల్‌కతా, మే 5: పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. రాజ్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో మంగళవారంనాడు మమతాబెనర్జీ మాట్లాడారు.

'ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీ చేశారు' అని మమత ఆరోపించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు పోలింగ్ ముగిసిన తర్వాత కూడా 80 నుంచి 90 శాతం కంటే ఎక్కువ బ్యాటరీని కలిగి ఉండటం ఏమిటి.. అని ప్రశ్నించారు. పోలింగ్‌కు రెండ్రోజుల ముందే అధికారులు తమ పార్టీపై దాడులు, కార్యకర్తల అరెస్టులు చేశారని అన్నారు.

భవనీపూర్‌లో ఉద్దేశపూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని అన్నారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించారనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు.

ఈ మొత్తం ఉదంతంలో 'ఇండి' కూటమి తన వైపే ఉందని తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తనతో మాట్లాడారని, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్, హేమంత్ సోరెన్ తదితరులు ఫోను చేసి సపోర్ట్‌గా నిలిచారని చెప్పారు. 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు.

## అడ్మిషన్ షెడ్యూల్‌పై ఇంటర్ బోర్డ్ కీలక నిర్ణయం

హైదరాబాద్, మే 05: ఇంటర్ అడ్మిషన్ షెడ్యూల్‌పై తెలంగాణ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ (టీజీబీఐఈ) కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 విద్య సంవత్సరానికి సంబంధించిన సర్క్యూలర్‌ను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ మేరకు మంగళవారం టీజీబీఐఈ ఆదేశాలు జారీ చేసింది. ప్రతిపాదిత సంస్కరణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. త్వరలో కొత్త మార్గదర్శకాలు విడుదల చేస్తామన్న ఇంటర్ బోర్డు ప్రకటించింది. అన్ని జూనియర్ కాలేజీలకు ఈ ఆదేశాలు జారీ చేసినట్లు వివరించింది. మే 4వ తేదీన ఈ విద్య సంవత్సరానికి సంబంధించిన సర్క్యూలర్‌ను టీజీబీఐఈ జారీ చేసిన సంగతి తెలిసిందే.

# డిజిటల్ యుగంలోనూ బాడీ షేమింగ్ అనాచారమా !

## (మే 06న "అంతర్జాతీయ ఆహార రహిత (నో డైయట్) దినోత్సవం" సందర్భంగా)

'బాడీ షేమింగ్' లేదా 'శరీర అవమానం' లేదా 'శరీర నింద' అనే దురాచారం నేటికీ సమాజంలో కనిపిస్తున్నది. మహిళలు బాడీ షేమింగ్ కారణంగా మహిళలు నిత్యం ఎంతో మనోవేదనకు లోనవుతుంటారు. లావుగా ఉందని, బక్కగా ఉందని, నల్లగా ఉందని, అందవిహీనంగా ఉందని పలు రకాలుగా మహిళలను వేధించే దుర్మార్గులు మనకు కనిపిస్తారు. ఇలాంటి బాడీ షేమింగ్ ప్రభావంతో మన ఆహారపు అలవాట్లు కూడా ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటుంది. మన శరీర రూపం, పరిమాణం, రంగు లాంటివి మన చేతిలో ఉండవు. పుట్టుకతో, జన్యుపరమైన కారణాలతో మన శరీర నిర్మాణం ఆధారపడి ఉంటాయి. ఇలా నిత్యం కామెంట్లు వినే మహిళలు తమ ఆహార నియమాలను పాటిస్తూ, ఉపవాసాలు లేదా ఆహారం తీసుకోకపోవడం కూడా జరుగుతోంది. ఇలాంటి విపరీత సంఘటనలను నివారించడానికి ప్రతి ఏటా 06 మే రోజున ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ ఆహార రహిత దినోత్సవం లేదా ఇంటర్నేషనల్ నో డైయట్ డే" పాటించడం 1992 నుంచి కొనసాగుతోంది.

అంతర్జాతీయ ఆహార రహిత దినోత్సవం:

శరీర ఆకార స్వీకరణ, వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, సంపూర్ణ ఆరోగ్యం పొందడం, నిర్బంధ రహిత జీవనశైలిని ప్రోత్సహించడానికి ప్రపంచ దేశాలు ప్రతి సంవత్సరం మే 6వ తేదీన "అంతర్జాతీయ ఆహార రహిత దినోత్సవం (ఇంటర్నేషనల్ నో డైయట్ డే)"ను పాటిస్తున్నాయి. ఈ వార్షిక ప్రపంచ కార్యక్రమం శరీర సానుకూలత, ఆత్మ ప్రేమ, నిర్బంధ ఆహార సంస్కృతి యొక్క హానికరమైన ప్రభావాలను సవాలు చేయడంపై దృష్టి పెడుతుంది. ఈ రోజు శరీర బరువు వివక్ష, లావు పట్ల భయం, నిర్బంధ ఆహార నియమాల వల్ల కలిగే ప్రమాదాలను ఎత్తి చూపుతుంది. ఇది ఆహార సంబంధిత రుగ్మతలు, బరువు సంబంధిత శస్త్రచికిత్సల బారిన పడిన వారికి నివాళులర్పిస్తుంది. ఈ రోజు వ్యక్తులు తమ శరీరాలను ఉన్నది ఉన్నట్లుగా అభినందించేలా ప్రోత్సహిస్తూ, ఆత్మ ప్రేమను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది.

ఇంటర్నేషనల్ నో డైట్ డే చరిత్ర:

అంతర్జాతీయ ఆహార రహిత దినోత్సవాన్ని 1992లో యూకేకు చెందిన స్త్రీవాది మేరీ ఇవాన్స్ యంగ్ స్థాపించారు. ఆమె స్వయంగా అనోరెక్సియాతో పోరాడిన తర్వాత, ప్రమాదకరమైన డైటింగ్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించడానికి, శరీర ఆకృతి స్వీకరణను ప్రోత్సహించడానికి దీనిని ప్రారంభించారు. మేరీ ఇవాన్స్ తన స్నేహితులను 'ఆ డైట్‌ను వదిలేయండి' అని ఆహ్వానించారు, దీనికి ప్రజల నుండి, ముఖ్యంగా మహిళల నుండి భారీ ప్రశంసలు లభించాయి. ఇది కఠినమైన డైటింగ్‌కు విరామం ఇవ్వాలని, బరువు గురించి అవమానించడం ఆపమని, ఆరోగ్యకరమైన శరీరాలు అన్ని ఆకారాలు, పరిమాణాలలో ఉంటాయని గుర్తించమని ప్రజలను ప్రోత్సహిస్తుంది. ఇది సామాజిక సౌందర్య ప్రమాణాలను, అవాస్తవ అంచనాలను సవాలు చేయమని కూడా పిలుపును ఇస్తుంది. అంతర్జాతీయ నో డైట్ దినోత్సవ కార్యకలాపాలలో బాడీ-పాజిటివ్ పిక్నిక్‌లు, వర్చువల్ ప్యానెల్ చర్చలు, కళాత్మక వ్యక్తీకరణలు, ఆనందకరమైన ఉద్యమాలు, విద్యాపరమైన చలనచిత్ర ప్రదర్శనలు, మద్దతు కోసం స్వచ్ఛంద సేవ, దుస్తుల మార్పిడి కార్యక్రమాలు, న్యాయవాద లేఖల రచనలు, వ్యాపార సహకారాలు, కృతజ్ఞతా జర్నలింగ్ వంటివి ఉంటాయి.

అంతర్జాతీయ నో డైట్ దినోత్సవం యొక్క ప్రాముఖ్యత:

అంతర్జాతీయ ఆహార రహిత దినోత్సవాన్ని మీ శరీరాన్ని ఉన్నది ఉన్నట్లుగా, దాని ప్రత్యేకతను, అందాన్ని అంగీకరిస్తూ జరుపుకుంటారు. శారీరక బరువుకు సంబంధించిన హానికరమైన ప్రభావాలు, వైద్య విధానాల గురించి అవగాహన కల్పించడానికి ఈ రోజు ఉద్దేశించబడింది. స్వీయ-అంగీకారానికి చిహ్నంగా, మీకు నచ్చిన, అపరాధ భావన లేని భోజనం లేదా స్నాక్స్‌ను ఆస్వాదించండి. మానసిక - శారీరక ఆరోగ్యంపై డైట్ సంస్కృతి యొక్క హానికరమైన ప్రభావం గురించి మనం అవగాహన పెంచుకోవాలి. ఆహార సంబంధిత రుగ్మతలతో బాధపడుతున్న వారిని గౌరవించడంతో పాటు వారికి మద్దతు ఇవ్వడానికి, ఆహారం మరియు స్వీయ-ప్రతిబింబంతో ఆరోగ్యకరమైన సంబంధాలను ప్రోత్సహించడానికి కూడా ఈ రోజు ఒక వేదికను అందిస్తుంది.

శరీర వైవిధ్యాన్ని గుర్తించి, డైట్ కల్చర్‌పై పోరాడి, ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించి, ఆహార సంబంధిత రుగ్మతలపై అవగాహన పెంచుదాం. ఈ రోజు శారీరక ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యత, శారీరక వ్యాయామాలను కొనసాగించడం, సమతుల్య పోషకాహారం తీసుకోవడం, మంచి ఆహారపు అలవాట్లు చేసుకోవడం, శరీర రూపానికి సంబంధించిన ఇతర రుగ్మతలపై అవగాహన కల్పించడం నిరంతరం కొనసాగాలి.



-మధుపాళీ
9949700037

# ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే ప్రజా ఉద్యమంగా పరిణామం చెందిన యోగా: కేంద్రమంత్రి శ్రీ ప్రతాపరావు జాదవ్

న్యూ ఢిల్లీ, మే 5:అంతర్జాతీయ యోగా దినోత్సవం (ఐడీవై) 2026 వేడుకలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు.. వాటి ప్రణాళిక, సమన్వయ అమలుపై చర్చించేందుకు కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నేడు న్యూఢిల్లీలో అంతర్ మంత్రిత్వ కమిటీ కీలక సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు, ప్రముఖ యోగా గురువులు, వివిధ యోగా సంస్థలు, సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ (స్వతంత్ర బాధ్యత), ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావు జాదవ్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్యం, శ్రేయస్సు కోసం యోగాను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ యోగ దినోత్సవ 50 రోజుల కౌంట్‌డౌన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఆయన గుర్తు చేశారు. యోగాపై ప్రజల ఉత్సాహం, భాగస్వామ్యం పెరుగుతోందని అన్నారు. యోగా ఇప్పుడు కేవలం శిక్షణ తరగతులకు లేదా మ్యాట్‌లకే పరిమితం కాకుండా, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే ఒక ప్రజా ఉద్యమంగా రూపాంతరం చెందిందని ఆయన పేర్కొన్నారు.

యోగా ద్వారా ప్రపంచ దేశాలకు భారత్ నాయకత్వం వహిస్తోందని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతతో 2015 నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవం 190కి పైగా దేశాలకు విస్తరించిందని పేర్కొన్నారు. శారీరక ఆరోగ్యం, మానసిక సమతుల్యత, అంతర్గత శాంతి కోసం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలకు యోగా స్ఫూర్తినిస్తోందని ఆయన వివరించారు.

ఐడీవై 2026 విజయవంతం కావడానికి అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలు చురుగ్గా సహకరించాలని... సంపూర్ణ ప్రభుత్వ విధానం అనుసరించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ దిశగా కొన్ని ముఖ్యమైన లక్ష్యాలను ఆయన వివరించారు. జూన్ 21న నిర్వహించే సాధారణ యోగా నియమావళి కార్యక్రమంలో గరిష్ఠ స్థాయిలో ప్రజలు పాల్గొనేలా చూడటం... పాఠశాలలు, కార్యాలయాలు, ఆరోగ్య వ్యవస్థల వంటి సంస్థాగత నిర్మాణాల్లో యోగాను ఒక భాగంగా మార్చడం... గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన వర్గాలు, సరిహద్దు, మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా యోగా ఫలాలు అందేలా చూడటం... ప్రచారం కోసం డిజిటల్ వేదికలను విరివిగా ఉపయోగించడం, కార్యక్రమాల అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వంటి అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు.

అన్ని మంత్రిత్వ శాఖలు భాగస్వామ్య పక్షాలు సమయానుకూలంగా, సమన్వయంతో పనిచేయాలని మంత్రి చెప్పారు. "12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మునుపెన్నడూ లేని రీతిలో భారీ ప్రజా భాగస్వామ్యం, సమర్థవంతమైన సమన్వయం, విస్తృత అవగాహనతో జరుపుకునేలా మనమందరం కలిసి పని చేద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు.

విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి (పశ్చిమ) శ్రీ సీబీ జార్జ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026ను ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు తమ మంత్రిత్వ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లు, మిషన్ల ద్వారా యోగాను విశ్వవ్యాప్తం చేయడంలో కీలక పాత్ర పోషిస్తామని ఆయన తెలిపారు. ప్రపంచ వ్యాప్తిని మరింత విస్తరించడానికి.. భారీ స్థాయి అవగాహన, సామాజిక కార్యక్రమాలను సమన్వయం చేయడంలో విదేశాల్లోని భారతీయ మిషన్లు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన చెప్పారు.

యోగాకు పెరుగుతున్న అంతర్జాతీయ ఆదరణను ప్రస్తావిస్తూ... జపాన్‌లో ఆయుష్ మంత్రిత్వ శాఖ, హార్ట్‌ఫుల్‌నెస్ సహకారంతో ఆరు నెలలుగా సాగుతున్న యోగా శిక్షణ కార్యక్రమం అద్భుతమైన విజయాన్ని సాధించిందని ఆయన పేర్కొన్నారు. ఇది ఆరోగ్యం, శ్రేయస్సు, అంతర్గత సమతుల్యతకు ఒక సాధనంగా యోగాకు పెరుగుతున్న ప్రపంచవ్యాప్త ఆమోదాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఇటువంటి నిరంతర ప్రయత్నాలు అంతర్జాతీయ భాగస్వామ్యాలు 2026 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిజమైన ప్రపంచ ఉద్యమంగా మారుస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కోటేచా ప్రసంగిస్తూ.. ఈ సమావేశంలో పాల్గొన్న వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 కార్యాచరణ ప్రణాళికను రూపొందించడంలో ఈ సమావేశం ఎంతో కీలకమైనదని ఆయన పేర్కొన్నారు. దేశ సాంస్కృతిక,ఆధ్యాత్మిక వారసత్వంలో యోగా ఒక ముఖ్యమైన భాగమని, నేడు అది అంతర్జాతీయ ఆరోగ్య ఉద్యమంగా రూపాంతరం చెందిందని ఆయన కొనియాడారు. 2014లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా గుర్తించినప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు, వర్గాల భాగస్వామ్యంతో యోగా విస్తృతి నిరంతరం పెరుగుతోందని అన్నారు. ఈ "అంతర్జాతీయ యోగా దినోత్స వం అనేది కేవలం ఒక రోజు జరుపుకునే వేడుక మాత్రమే కాదు. ఆరోగ్యం, సమతుల్యత, సంపూర్ణ జీవనశైలిని ప్రోత్సహించే ఒక నిరంతర ప్రపంచ ప్రచారం" స్పష్టం చేశారు.

ప్రపంచవ్యాప్తంగా యోగా సాధకుల సంఖ్య నిరంతరం పెరుగుతోందని ఎస్ వ్యాస విశ్వవిద్యాలయం అధ్యక్షుడు డాక్టర్ హెచ్ ఆర్ నాగేంద్ర పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజా భాగస్వామ్యం ఇటీవల అద్భుతంగా విస్తరిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. గత ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవంలో 26 కోట్ల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారని గుర్తు చేస్తూ.. ఈ ఏడాది ఆ సంఖ్య 30 కోట్లు దాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. సాక్ష్యాధారిత యోగా సాధన ప్రాముఖ్యతను ఆయన వివరించారు. పెరుగుతున్న పరిశోధనలు యోగాను కేవలం శారీరక క్షేమానికే కాకుండా, అంటువ్యాధులు కాని వ్యాధుల నివారణ, నిర్వహణలో అత్యంత ప్రభావవంతమైన మార్గంగా నిరూపించాయని స్పష్టం చేశారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 వేడుకలకు మోక్షాయతన్ అంతర్జాతీయ యోగాశ్రమం అధ్యక్షుడు శ్రీ స్వామి డాక్టర్ భరత్ భూషణ్ తన పూర్తి మద్దతును ప్రకటించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రయత్నాలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి పౌరుడి దైనందిన జీవనశైలిలో యోగా ఒక భాగంగా మారేలా చూడాలని ఆయన చెప్పారు. యోగా పరివర్తన శక్తిని వివరిస్తూ... "మనిషిని ఎలాంటి కష్టాల నుంచి అయిన గట్టెక్కించే శక్తి ఉంది. ఇది వ్యక్తులను మరింత ఆరోగ్యకరమైన, సమతుల్యమైన జీవితం వైపు నడిపిస్తుంది'' ఆయన పేర్కొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 కోసం ప్రతిపాదించిన వ్యూహాలు, కార్యకలాపాలపై ఆయుష్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి మోనాలిసా దాష్ ఒక సమగ్రమైన ప్రజెంటేషన్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆమె రాబోయే వేడుకలకు సంబంధించిన కీలక కార్యక్రమాలు, నేపథ్య ప్రాధాన్యతాంశాలు, ప్రచార ప్రణాళికలను వివరించారు. అనంతరం జరిగిన సుదీర్ఘ చర్చల్లో వివిధ మంత్రిత్వ శాఖల ప్రతినిధులు, ప్రముఖ యోగా గురువులు, వివిధ యోగా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ స్థాయిలో యోగా దినోత్సవ ప్రభావాన్ని మరింత పెంచేందుకు వారు తమ సూచనలు, సలహాలను పంచుకున్నారు. ఈ వేడుకలను విజయవంతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా పలు సంస్థల ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 వేడుకల్లో భాగంగా మరింత విస్తృతమైన ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు సంపూర్ణ ప్రభుత్వ విధానం అనుసరించాలని చర్చల్లో నిర్ణయించారు. సంస్థాగత వ్యవస్థలు, మీడియా వేదికలు, సామాజిక భాగస్వామ్యం ద్వారా యోగా విశిష్టతను చాటిచెప్పాలని ప్రతినిధులు చెప్పారు. ముఖ్యంగా యువత భాగస్వామ్యం, డిజిటల్ ప్రచారం, ప్రస్తుతం అమలవుతున్న జాతీయ ఆరోగ్య, శ్రేయస్సు పథకాలతో యోగాను అనుసంధానించడంపై ప్రత్యేక దృష్టి సారించారు.అంతర్జాతీయ యోగా దినోత్స వం 2026 లక్ష్యాలను చేరుకోవడానికి ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అన్ని మంత్రిత్వ శాఖలకు, భాగస్వామ్య పక్షాలకు ఒక దిశానిర్దేశంలా పనిచేస్తాయని ఆయుష్ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. సమ్మిళితత్వం, నూతన ఆవిష్కరణలు, ప్రపంచ స్థాయి భాగస్వామ్యంతో నిర్వహించబోయే ఈ వేడుకలు.. ఆరోగ్యం, సామరస్యం, సంక్షేమం కోసం యోగాను ఒక విశ్వవ్యాప్త మార్గంగా ప్రచారం చేయడంలో దేశ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని మంత్రిత్వ శాఖ ఆశాభావం వ్యక్తం చేసింది.

## బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యం : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

హైదరాబాద్, మే 5: బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి సంస్థాగత ఎన్నికలు కీలకమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని 188 డివిజన్ నేరేడ్‌మెట్, 189 కౌకూర్ యాప్రాల్ డివిజన్‌లలో బీఆర్ఎస్ పార్టీ సంస్థాగత ఎన్నికల నేపథ్యంలో మంగళవారం విస్తృత స్థాయి సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశాలకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ స్థాయి కమిటీలను సమర్థవంతంగా ఏర్పాటు చేసి పార్టీని గ్రామ స్థాయిమి నుంచి మరింత బలోపేతం చేయాలని సూచించారు.

సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి ప్రతి ఇంటికి పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండి ఓటర్ల హక్కులను పరిరక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యకర్తల అభిప్రాయాలను శ్రద్ధగా విన్న ఆయన వారి సూచనలకు తగిన ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చా. ప్రతిపక్షంలో ఉన్నప్పటికి మల్కాజిగిరి అభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పనులుచేయిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## బ్యాంకులలో భద్రత చర్యలు చేపట్టాలి..

### -మంథని సీఐ బొల్లపల్లి రాజు గౌడ్

కరీంనగర్, మే 5: బ్యాంకులలో భద్రత చర్యలు చేపట్టాలని, సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని మంథని సీఐ బొల్లపల్లి రాజు గౌడ్ బ్యాంకు అధికారులకు సూచించారు. రామగిరి మండలంలోని పలు బ్యాంకులను రామగిరి ఎస్సై




తాడవేని శ్రీనివాస్ తో కలిసి ఆయన మంగళవారం సందర్శించారు. బ్యాంకులలో అలారం సిస్టం, సీసీ కెమెరాల పనితీరు, సెక్యూరిటీ గార్డ్స్ ఇతర భద్రత ఏర్పాట్లు,ఏటీఎం సెంటర్ లలో అలారం సిస్టమ్, సీసీ కెమెరాల పని తీరు, ఇతర భద్రత విషయాలపై పరిశీలన చేశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ బ్యాంకుల రక్షణ కోసం సీసీ కెమెరాలు నిత్యం పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

లాకర్ , అలారమ్ సిస్టమ్‌లు తప్పనిసరిగా పనిచేయాలన్నారు. ప్రజల డబ్బులకు భద్రత కల్పించేవి బ్యాంకులని దీన్ని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బ్యాంకు, ఏటీఎం సిబ్బందికి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనువ వానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఇటీవల కరీంనగర్ లో జరిగిన బంగారం దుకాణం దోపిడీ ఘటనను ఉదాహరణగా తీసుకుని, ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. "మీ సమాచారం ఒక ప్రాణాన్ని కాపాడవచ్చు? ఒక నేరాన్ని అడ్డుకోవచ్చు. మీ సహకారం సురక్షిత సమాజానికి మా బలం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల శ్రేయస్సే గాంధీజీ ఫౌండేషన్ ఆశయం

### -గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాస్




నల్గొండ, మే 5: ఏ ఆసరా లేని నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్ ఆశయం అని ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, అరుణ దంపతులు అన్నారు. ప్రతినెల 30 మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల విలువ చేసే నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలనే లక్ష్యంతో మంగళవారం చండూరు మున్సిపల్ కేంద్రంలోని గాంధీజీ విద్యా సంస్థల యందు నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కోటి శ్రీనివాసులు మాట్లాడుతూ.. తమ జీవితం ఉన్నంత వరకు గాంధీజీ ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు ఉచిత నిత్యావసర సరుకుల పంపిణీతో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజంలో ఆదర్శవంతంగా జీవిస్తామన్నారు. అలాగే తమ విద్యాసంస్థల ద్వారా తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు చాలా తక్కువ ఫీజులతో విద్యనందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్స్ పులిపాటి రాధిక, చిలుకూరి రామేశ్వరి, బోడ యాదయ్య, బుషిపాక యాదగిరి, గోపి పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆదేశంతో సొసైటీ పాలకవర్గం తిరిగి కొనసాగింపు

### - చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు

ఖమ్మం, మే 5: రాష్ట్రంలో గతంలో బాధ్యతలు తీసుకున్న సొసైటీ పాలకవర్గాలు తిరిగి పాలకవర్గాన్ని కొనసాగించాలని ఆదేశించడంతో ప్రభుత్వం చేసిన సూచన మేరకు బూర్గంపహాడ్ మండలంలో పీఏసీఎస్ పాలకవర్గాన్ని తిరిగి కొనసాగించారు. మంగళవారం ఈ మేరకు సొసైటీ చైర్మన్ గా బిక్కసాని శ్రీనివాసరావు పాలకవర్గ సభ్యులతో కలిసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులకు సొసైటీ ద్వారా అన్ని సదుపాయాలు కల్పించాలని, వ్యవసాయపరంగా రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనవద్దని, కొనుగోలు కేంద్రాల్లో వారికి సకల సదుపాయాలు కల్పించాలని పాలకవర్గానికి, సొసైటీ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సొసైటీ సీఈఓ ప్రసాద్, సిబ్బంది తిరుపతిరెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పాల్వంచ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వాక్సిన్ రూమ్ ప్రారంభం

పాల్వంచ, మే 05 : నవ భారత్ కంపెనీ పాల్వంచ వారి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీస్ కార్యక్రమంలో భాగంగా పాల్వంచలోని శేఖరం బంజర్ లో గల అర్బన్ హెల్త్ సెంటర్ లో వ్యాక్సిన్ రూమ్ ను నిర్మించారు. దీనిని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్ శేఖర బంజర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణ కుమారి మాట్లాడుతూ.. వాక్సిన్ సమయంలో రోగులు ఎదురుకుంటున్న సమస్యలను నవ లిమిటెడ్ మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి మూడు నెలల్లోనే వాక్సిన్ రూమ్ ను నిర్మాణం చేసి అప్పగించడం జరిగిందన్నారు.

## కారేపల్లి సొసైటీ చైర్మన్‌గా దుగ్గినేని శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరణ

ఖమ్మం, మే 5:కారేపల్లి మండల కేంద్రంలోని సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్ గా దుగ్గినేని శ్రీనివాసరావు మంగళవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు తీర్పు మేరకు జిల్లా సొసైటీ పర్సనల్ ఇన్‌చార్జి మేరీ కుమారి చేతుల మీదుగా సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తామన్నారు.

రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. రైతులకు సకాలంలో యూరియా, ఎరువులు, విత్తనాలను అందజేస్తూ సొసైటీ బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ బొల్లు హనుమంతరావు, డైరెక్టర్లు అడ్డగోడ ఐలయ్య, దేగల ఉపేందర్, సొసైటీ సిబ్బంది డి.కృష్ణ, సాంబశివరావు, పాషా పాల్గొన్నారు.

# అపాయం అధికంగా ఉండే చోట్ల మరిన్ని రక్షణ చర్యలతో కొత్త మార్గదర్శక సూత్రాలు

న్యూఢిల్లీ, మే 5:దేశమంతటా అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాన్ని ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు పాటిస్తున్నారు. కేంద్ర పాలిత ప్రాంతాల భాగస్వామ్యంతో, సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలతో సమన్వయంతో ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.

"ఆరోగ్య కేంద్రాల్లో అగ్ని ప్రమాదాల నివారణ" అంశంపై ప్రతిజ్ఞను స్వీకరించే కార్యక్రమాన్ని దేశం నలు మూలలా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆరోగ్య కార్యదర్శి శ్రీమతి పుణ్య సలిల శ్రీవాస్తవ నాయకత్వం వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా నివారణ చర్యలు అమలు చేయడం, ఒకవేళ ప్రమాదాలు జరిగితే ఆ సమయంలో వాటిని ఎదుర్కోవడానికి సర్వ సన్నద్ధంగా ఉండడం, తగిన ప్రణాళికలను అమలు పరచడం వంటి ఆలోచనలకు ఆచరణ రూపాన్ని ఇవ్వడంలో ఆస్పత్రుల తోపాటు ఆసక్తిదారు వర్గాలు ఉమ్మడిగా కట్టుబడి ఉంటాయని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

ఈ సంవత్సరంలో అగ్ని ప్రమాద నివారణ వారోత్సవానికి "సేఫ్ స్కూల్స్, సేఫ్ హాస్పిటల్స్, అండ్ ఎ ఫైర్ సేఫ్టీ అవేర్ సొసైటీ: టుగెదర్ ఫర్ ఫైర్ ప్రివెన్షన్" (సురక్షిత పాఠశాలలు, సురక్షిత ఆసుపత్రులతో పాటు సురక్ష జాగృతి కలిగిన సమాజం: అగ్ని ప్రమాదాల నివారణ బాటలో కలిసి నడుద్దాం)ను ఇతివృత్తంగా ఎంపిక చేసినట్లు కేంద్ర ఆరోగ్య కార్యదర్శి శ్రీమతి పుణ్య సలిల శ్రీవాస్తవ తన ప్రసంగంలో వెల్లడించారు. ఈ ఇతివృత్తం మన సంస్థల్లో భద్రతను ఉమ్మడి, సామూహిక బాధ్యతగా చాటిచెబుతుందని ఆమె అన్నారు. ప్రస్తుత మౌలిక సదుపాయాలను పునస్సమీక్షించుకొనేందుకు, ఇప్పటి కేంద్రాల్లో రక్షణ ఉందా అని మదింపు చేసేందుకు, భర్తీ చేయాల్సిన లోపాలను, లోటుపాట్లను గుర్తించేందుకు ఒక అవకాశాన్ని ఫైర్ సేఫ్టీ వీక్ అందిస్తోందని శ్రీమతి శ్రీవాస్తవ తెలిపారు. సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తూ, అగ్ని ప్రమాదాల సమయంలో దీటుగా ప్రతిస్పందించడానికి ఆరోగ్య సంరక్షణ వృత్తి నిపుణులకు తగినంత శిక్షణనీ, జాగరూకతనీ అందించాలని ఆమె సూచించారు. అగ్ని ప్రమాదాల నుంచి రక్షణకు చేపడుతున్న చర్యల ఆడిట్ వివరాలను క్రమం తప్పకుండా ఐహెచ్ఐపీ పోర్టల్లో నిరంతరం పొందుపరుస్తూ ఉండాల్సిందిగా అన్ని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆమె విజ్ఞప్తి చేశారు. ఇలాంటి చర్యలు సంబంధిత ప్రణాళికలను పాటించడాన్ని సంస్థాగతీకరిస్తాయనీ, భద్రతా ప్రమాణాల ప్రాముఖ్యాన్ని ఎప్పటికప్పుడు గుర్తు చేస్తుంటాయనీ ఆమె అన్నారు.

అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ పొందడానికి రూపొందించిన ఐజీఓటీ పాఠ్యక్రమాన్ని ఇప్పటికే ప్రభుత్వ సంస్థలతో పాటు 50,000 కన్న ఎక్కువ మంది పూర్తి చేయడం సంతోషంగా ఉందని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి అన్నారు. ఈ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశమంతటా అగ్ని ముప్పు నుంచి తప్పించుకొనే ప్రణాళికలను పటిష్ఠపరచడంలో ప్రజలను భాగస్వాములను చేసినప్పుడు అర్థవంతమైన, నిరంతర ప్రభావాన్ని ప్రసరింప చేయగలమని చెబుతూ ఆమె తన ప్రసంగాన్ని ముగించారు.

జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎమ్ఏ) సభ్యుడు, ప్రధానాధికారి శ్రీ కృష్ణ ఎస్. వత్స మాట్లాడుతూ, ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో ప్రమాదం జరగడానికి ముందే అలాంటి వాటికి ఆస్కారాన్ని ఇవ్వకుండా తగిన జాగ్రత్త చర్యలను తీసుకోవాల్సిన, కొన్ని పటిష్ఠ వ్యవస్థలను నెలకొల్పుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆసుపత్రుల్లో ఫైర్ సేఫ్టీని బలోపేతం చేయడానికి దేశవ్యాప్తంగా ప్రచార ఉద్యమాన్ని చేపట్టాలని ఆయన అన్నారు. ఈ దిశగా అయిదు ప్రాంతీయ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని ఎన్‌డీఎమ్ఏ ఆలోచిస్తోందని, ఇదే రకం కార్యక్రమాలను రాష్ట్ర స్థాయిలోనూ జిల్లా స్థాయిలోనూ చేపట్టి సామర్థ్యంతో పాటు సన్నద్ధతను పెంచుతారని ఆయన తెలిపారు. ఎప్పటికప్పుడు ఆడిట్ల నిర్వహణ కోసం స్వీయ ప్రమాణీకరణ యంత్రాంగాలను ఏర్పాటు చేయడం ముఖ్యమనీ, అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ పొందడానికి తీసుకోవాల్సిన చర్యలపై నిరంతర జాగృతి కార్యక్రమాలను అమలు చేస్తుండాలనీ ఆయన అన్నారు. ఆసుపత్రి స్థాయిలో సన్నాహక చర్యలను రూపొందించుకోవడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాలని ఆయన సూచించారు. మంటలు చెలరేగిన సమయాల్లో ప్రతిస్పందించగలిగే సుశిక్షితులైన ఆరోగ్య సంరక్షణ వృత్తినిపుణులు ప్రతి ఆసుపత్రిలో ఉండాలనీ, ఒకవేళ మంటలు వ్యాపిస్తే అక్కడి నుంచి రోగులను, వారి బంధువులను ఆసుపత్రి నుంచి బయటకు పంపించే పద్ధతులను స్పష్టంగా పేర్కొనడంతో పాటు ఆ పద్ధతులను తరచు ప్రయోగపూర్వకంగా అమలు చేయడం మరీ మంచిదనీ ఆయన అన్నారు.

ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో అగ్ని నుంచి రక్షణ దిశగా చేపట్టాల్సిన చర్యలకు సంబంధించి ముందు జాగ్రత్త చర్యలతో పాటు నిర్దిష్ట విధానాన్నంటూ కలిగివుండడం అత్యంత ప్రధాన అంశమని ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ శ్రీ సునీల్ కుమార్ ఝా తెలిపారు. ఆసుపత్రుల పరిసరాలు ఎంతో కీలకమైనవీ, జటిలమైనవీ అని ఆయన చెబుతూ, అక్కడ జరిగే చిన్న చిన్న లోపాలు కూడా తీవ్ర పర్యవసానాలకు దారితీయువచ్చంటూ హెచ్చరిక చేశారు. భద్రత నియమావళి, క్రమం తప్పక ఆడిట్లు, సామర్థ్యాన్ని పెంపొందించుకొనే విధానాలు.. వీటిని తూచా తప్పక పాటించాల్సిన అవసరం ఉందనీ, అగ్ని ప్రమాదాలను నివారించాలన్నా, అత్యవసర స్థితిలో దీటుగా ప్రతిస్పందించాలన్నా సన్నద్ధత, సమన్వయం, నిరంతర నిఘా కీలకమనీ ఆయన వివరించారు.

ఈ సందర్భంగా, 'ఆరోగ్య కేంద్రాల్లో అగ్ని, జీవన సురక్షల జాతీయ మార్గదర్శకాలు-2026' ను మంత్రిత్వ శాఖ అధికారికంగా వెల్లడించింది. ఈ మార్గదర్శకాల్ని ఆసుపత్రుల్లో మంటల నుంచి రక్షణ కోసం దృఢతర, సమగ్ర ప్రణాళికను నిర్ధారించడానికి అనేక ప్రధాన సంస్థలకు, ఆసుపత్రులకు చెందిన నిపుణులతో విస్తృత స్థాయి సంప్రదింపులు జరిపిన తరువాత రూపొందించారు.

ఈ మార్గదర్శక సూత్రాల్లో పరిపాలన ప్రణాళికలు, రిస్క్ అంచనా, నివారణ, మౌలిక సదుపాయాల కల్పన, అత్యవసర స్థితిలో అనుసరించదగ్గ ప్రతిస్పందన వ్యవస్థలు, ఆరోగ్యసంరక్షణ సిబ్బందికి శిక్షణ, వారి సామర్థ్యాల పెంపుదల, నియమపాలన యంత్రాంగాల ఏర్పాటు, అవగాహన కలిగించడం సహా అనేక కీలక కోణాలను పొందుపరిచారు. వీటిలో అతి కఠినమైన సురక్ష ప్రోటోకాల్స్‌ను పాటించడం తప్పనిసరైన ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు (ఐసీయూలు), అప్పుడే పుట్టిన శిశువులకు సంబంధించిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు (ఎన్ఐసీయూలు), పిల్లల కోసం ఉద్దేశించిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు (పీఐసీయూలు), ఆపరేషన్ థియేటర్లు (ఓటీ) వంటి అధిక రిస్కుతో కూడిన ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన తాజా నిబంధనలు కూడా ఉన్నాయి.

ఆరోగ్య సంరక్షణ సదుపాయాల్లో అగ్నికి సంబంధించిన ప్రమాదాలను అడ్డుకోవడానికీ, నివారణకీ అవగాహనను పెంచడంతో పాటు సంస్థాగత సన్నాహకాలను బలోపేతం చేసే ఉద్దేశంతో అగ్ని సురక్ష వారోత్సవం కాలంలో దేశమంతటా అనేక విధాలైన కార్యకలాపాలకు పథక రచన చేశారు. జాతీయ స్థాయిలో ప్రతిజ్ఞా స్వీకార కార్యక్రమానికి అదనంగా, సువ్యవస్థిత అగ్ని సురక్ష ఆడిట్, మాక్ డ్రిల్, అగ్ని ప్రమాద గుర్తింపు, మంటలను ఆర్పేందుకు ప్రణాళికలను ప్రత్యక్షంగా ప్రదర్శించడం, రోగులను ఆసుపత్రి నుంచి ఖాళీ చేయించి సురక్షిత ప్రదేశాలకు తరలించడం, అత్యుత్తమ కార్యప్రణాళికలు, సాంకేతిక జ్ఞాన వ్యాప్తికి ఉద్దేశించిన టెక్నికల్ వెబినార్లను ఏర్పాటు చేయడం కూడా ప్రతిపాదిత కార్యకలాపాల్లో కలిసి ఉన్నాయి.

ప్రభావవంతమైన కార్యాచరణకు పూచీ పడడం కోసం ఒక అత్యంత తాజా, విస్తృత చెక్ లిస్టును కేంద్ర ఆరోగ్య శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు పంపించింది. ఆ చెక్‌లిస్టులో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఆరోగ్య సంరక్షణ సదుపాయాలూ కఠోర అగ్ని, విద్యుత్తు సురక్ష సంబంధిత ఆడిట్లను పూర్తి చేయాల్సిందిగా ఆదేశాలిచ్చారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు లక్షిత వర్గాలను ఉద్దేశించి చైతన్య ప్రచార ఉద్యమాన్ని.. విశేషించి, వైద్య కళాశాలలు, పెద్ద మూడో శ్రేణి సంరక్షణ సంస్థల్లో నిర్వహించేటట్లు ప్రోత్సహించారు. ఈ కార్యక్రమాల్లో పోస్టర్ రూపకల్పన, ప్రశ్న-జవాబుల పోటీల నిర్వహణ, అగ్ని ప్రమాదాల జాడ కనిపెట్టడం, అగ్నిమాపక పరికరాలు, ప్రణాళికలను అత్యుత్తమంగా ఉపయోగించడమెలాగో ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా తెలియజెప్పడం వంటి చర్యలు భాగంగా ఉన్నాయి. సురక్షకు సంబంధించిన విషయాలపై చైతన్యాన్ని ఆరోగ్య సంరక్షణ రంగ నిపుణులతో పాటు విద్యార్థులు కూడా అలవరుచుకొనే సంస్కృతిని ఈ కార్యక్రమాలతో పెంపొందించవచ్చు.

వారం రోజుల పాటు ఈ ఉత్సవంలో చురుకుగా పాలుపంచుకొని, నిర్దేశిత మార్గదర్శకాలను వాటి సరైన అర్థంలో అనుసరించాల్సిందిగా ఆసక్తిదారులందరికీ మంత్రిత్వ శాఖ పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా రోగులు, సంరక్షకులు, ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలను దృష్టిలో పెట్టుకొని ఒక సురక్షితన, ధీర, ప్రతిస్పందనపూర్వక స్వాస్థ్య అనుబంధ విస్తారిత వ్యవస్థను ఏర్పరచాలన్నది ఈ మార్గదర్శకాల అంతిమ లక్ష్యం.

## ఎక్స్‌ప్రెస్‌వేపై అదుపు తప్పిన స్కార్పియో.. అయిదుగురు పోలీసులు మృతి

న్యూఢిల్లీ, మే 5:హర్యానాలోని నుహ్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కుండలి-మనేసర్-పల్వాల్ కేఎంపీ ఎక్స్‌ప్రెస్‌వే(ఐఓఖ ఇలీజూతీవబబలిజీఎ)పై జరిగిన ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అయిదుగురు పోలీసులు మృతిచెందారు. అతివేగంతో వెళ్తున్న వాహనం అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. తౌరు సదర్ పోలీసు స్టేషన్ పరిధిలోని దులావత్ టోల్ ప్లాజా వద్ద దుర్ఘటన చోటుచేసుకున్నది. ప్రమాద ప్రదేశానికి స్థానిక పోలీసులు, ఎమర్జెన్సీ బృందాలు వెళ్లాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం.. యూపీలోని జలౌన్ జిల్లాలో ఆ పోలీసులు పోస్టింగ్‌లో ఉన్నారు. మహేంద్ర స్కార్పియో వాహనంలో వాళ్లు పల్వాల్ వెళుతున్న సమయంలో ప్రమాదం జరిగింది.

టోల్ ప్లాజా సమీపంలో మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే సమయంలో.. అదుపు తప్పి ముందున్న వాహనాన్ని స్కార్పియో ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రెండు వాహనాలు బలంగా ఢీకొనడంతో ఎస్‌యూవీ నుజ్జునుజ్జు అయ్యింది. దీంతో ఆ వాహనంలో ఉన్న అయిదుగురు పోలీసులు మృతిచెందారు. వాహన శిథిలాల్లో చిక్కుకున్న వారిని తొలగించారు. స్కార్పియో వాహనంలో మృతిచెందిన అయిదుగుర్నీ పోలీసులుగా గుర్తించినట్లు తౌరు సదర్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు కేంద్ర పరిశీలకుడిగా అమిత్ షా.. అసోంకు జేపీ నడ్డా



న్యూఢిల్లీ, మే 5:పశ్చిమ బెంగాల్, అసోంలలో బీజేపీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుంది. బెంగాల్ సీఎం ఎవరూ అనేదానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర పరిశీలకుడిగా కేంద్ర హోం మంత్రి అమిత్ షాను నియమించింది బీజేపీ అధిష్టానం. అలాగే, ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝిని సహ పరిశీలకుడిగా నియమించింది. అమిత్ షా, మోహన్ చరణ్ ఆధ్వర్యంలో బెంగాల్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు, అగ్రనేతలు సమావేశమవుతారు.

బెంగాల్ బీజేపీ లెజిస్లేటివ్ నేతను ఎన్నుకుంటారు. ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నుకోవడం, కొత్త ప్రభుత్వ ఏర్పాటును షా, మోహన్ పర్యవేక్షిస్తారు. బెంగాల్‌లో ఈ నెల 9న కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ 207 సీట్లు గెలుచుకుంది. మరోవైపు అసోంకు సంబంధించి ప్రభుత్వ ఏర్పాటుకోసం కేంద్ర పరిశీలకుడిగా కేంద్ర మంత్రి, బీజేపీ మాజీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాను బీజేపీ నియమించింది. నడ్డాతోపాటు సహపరిశీలకుడిగా హరియాణా సీఎం నయాబ్ సింగ్ సైని వ్యవహరిస్తారు. వీరు ఇద్దరూ అసోంలో బీజేపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటు, లెజిస్లేటివ్ పార్టీ లీడర్ ఎన్నికను పర్యవేక్షిస్తారు.

అసోంలో బీజేపీ కూటమి 82 సీట్లు గెలుచుకుంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ తొలిసారి అధికారం చేపట్టబోతుంది. దీంతో ముఖ్యమంత్రి అభ్యర్థి విషయంలో ఆసక్తి నెలకొంది. బీజేపీ అధిష్టానం ఎవరిని నియమిస్తుందో చూడాలి. ప్రస్తుతానికి సువేందు అధికారి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అసోంలో ఇప్పటికే బీజేపీ నుంచి సీఎంగా ఉన్న హిమంత బిశ్వ శర్మ అదే పదవిలో కొనసాగుతారు.

# రైతుల గోస రేవంత్ రెడ్డికి తగులుతుంది : మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



హైదరాబాద్, మే 5:రైతులను కష్టాలపాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి రైతుల గోస తగులుతుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మంగళవారం వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం గూడెప్పాడు మార్కెట్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను కలిసి వారి సమస్యలు, కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న మోసాలను అడిగి తెలుసుకున్నారు. 20 రోజులు గడిచిన కాంటాలు పెట్టడంలేదని, ఏది చేయాలన్న డబ్బులు అడుగుతున్నారని, కనీసం తాగడానికి నీళు కూడా మార్కెట్‌లో లేవని, అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే కాంటాలు పెడుతున్నారని రైతులు మాజీ ఎమ్మెల్యేకి తెలుపుతూ కన్నీరు పెట్టుకున్నారు. దీంతో రైతులతో కలిసి గుడెప్పాడ్ క్రాస్ వద్ద మక్కలు కొనుగోలు చేయాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ..మక్కలు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. గన్నీ బ్యాగులు ఇవ్వకుండా, కాంటాలైన బస్తాలు తరలించకుండా కావాలనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మక్కల కొనుగోలులో అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారని రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నట్లు తెలిపారు. రాహుల్‌గాంధీ వరంగల్‌లో రైతు డిక్లరేషన్ సభ నిర్వహించి ఈ నెల 6నాటికి నాలుగేండ్లు పూర్తవుతున్నా ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

రుణమాఫీ కాలేదని, రైతు భరోసాను ఎగ్గొట్టారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడా మక్కలు కొనడం లేదని, దీంతో రైతులు మండుటెండలో పడిగాపులు కాస్తున్నారని అన్నారు. ఈ నెల 6న హనుమకొండలో నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలని చల్లా ధర్మారెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐటీసీ యాజమాన్యానికి కార్మిక జేఏసీ రిమైండర్ సమ్మె నోటీస్



నల్గొండ, మే 5:కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే ఏ క్షణమైనా సమ్మెకు సిద్ధంగా ఉన్నామని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో-కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, ఎండీ.యాకూబ్‌పాషా, ఆకిని సర్వేశ్వరరావు, బల్లెం నాగయ్య స్పష్టం చేశారు. మంగళవారం కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కానీపక్షంలో ఐటీసీ యాజమాన్యం స్పందించాలని రిమైండర్ సమ్మె నోటీసు మరోసారి హెచ్‌ఆర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక సమస్యలు, వేతన ఒప్పంద పెండింగ్ సమస్యలపై ఫిబ్రవరి 11న లేబర్ డిపార్ట్‌మెంట్‌కు నోటీసు ఇచ్చామని, అయినప్పటికీ యాజమాన్యం, లేబర్ డిపార్ట్‌మెంట్ కార్మిక జేఏసీతో ఎలాంటి చర్చలు జరపకుండా 14వ వేతన ఒప్పందం గుర్తింపు సంఘంతో కలిసి ఏకపక్షంగా చర్చలు జరిపి కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందం పూర్తి చేశారని సమాచారం అందిందన్నారు.

ఈ వేతన ఒప్పందంలో కార్మికులు అడిగిన డిమాండ్లు పరిష్కరించకుండా సరైన న్యాయం జరగకపోతే జనరల్ బాడీ మీటింగ్ తర్వాత ఏ క్షణమైనా సమ్మెకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని, దీనికి యాజమాన్యం, లేబర్ కమిషనర్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. తొలుత 41వ రోజు చేపట్టిన దీక్షలకు బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి, శ్రమశక్తి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బీఆర్టీయూ అధ్యక్షుడు కుందూరు పెద్దిరెడ్డి, ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకుడు మారం వెంకటేశ్వరరెడ్డి హాజరై కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ దీక్షా కార్యక్రమంలో జేఏసీ బాధ్యులు, జేఏసీ సభ్యులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం ఇవ్వాలి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

హైదరాబాద్, మే 5: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి చెక్కులతోపాటు తులం బంగారం కూడా అందించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మల్కాజిగిరిలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎలాగైనా గెలువాలని కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలను ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించిందని మండిపడ్డారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా అందేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ సీతారాం, డీటీ, మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బద్దం పరశురాంరెడ్డి, జీకే హన్మంతరావు, జేఏసీ వెంకన్న, చిందం శ్రీనివాస్, ప్రభాకర్‌గౌడ్, శ్రీనివాన్ గౌడ్, శివగౌడ్, సాయిగౌడ్, ఇబ్రహీం, కేబుల్ రమేష్, ఫరీద్, చందు, సురేష్, నర్సింగ్ రావు, నవాబ్ తదితరులు పాల్గొన్నారు.

# 'పది'లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పారితోషికం




కరీంనగర్, మే 5: ప్రభుత్వ పాఠశాలలో చదివి చిగురుమామిడి మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన పదో తరగతి విద్యార్థులకు చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నగదు పారితోషంతో సహా పాటు శాలువాతో ఘనంగా సత్కరించారు. చిగురుమామిడి మండల స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన షేక్ మోహబి 543, ఎండీ అశ్ర సుల్తానా 521, గట్టు సాయి వర్షిత 506, అప్పాల అనూష 500 మార్కులు సాధించడంతో ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున రూ.20వేలను ఉపసర్పంచ్ చింతపూల అనిల్ వ్యక్తిగతంగా నగదును సర్పంచ్ చింతపూల నరేందర్ తో కలిసి అందజేశారు.

పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత సాధించడంతో ఉత్తీర్ణత సాధించడంతో విద్యార్థులను శాలువాతో ఘనంగా సత్కరించి సీట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండాలని, పాఠశాలకు గ్రామానికి మంచి గుర్తింపును తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జయప్రద, లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదె రఘునాథరెడ్డి, పాఠశాల మాజీ చైర్మన్ బింగి స్వామి, వార్డు సభ్యులు కిరణ్, ఉమర్, తిరుపతి, లక్ష్మి, పూజ, విజయ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సృజనాత్మక రంగానికి ఉద్దేశించిన ఐఐసీటీ జాతీయ ఏఐ నైపుణ్య శిక్షణ కార్యక్రమానికి నమోదు ప్రారంభం

న్యూఢిల్లీ, మే 5:భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, భారతీయ సృజనాత్మక సాంకేతిక సంస్థ (ఐఐసీటీ) భాగస్వామ్యంతో సృజనాత్మక రంగంలో జాతీయ స్థాయి కృత్రిమ మేధ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించింది. గూగుల్, యూట్యూబ్ సహకారంతో రూపొందించిన ఈ కార్యక్రమం ద్వారా మీడియా, వినోదం, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కథా రచన రంగాల్లోని 15,000 మంది ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా అభ్యర్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా కృత్రిమ మేధ నైపుణ్యాలను నేర్పిస్తారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం కోసం నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సృజనాత్మక రంగాల్లో తమ భవిష్యత్తును మెరుగుపరిచే ఏఐ నైపుణ్యాలను పొందాలని మంత్రిత్వ శాఖ కోరింది.

పెద్ద ఎత్తున ప్రాథమిక కృత్రిమ మేధ అక్షరాస్యతను పెంపొందించడం కోసం ఈ దశను రూపొందించారు. ఇందులో భాగంగా ఎంపికైన 15,000 మందికి గూగుల్ కెరీర్ సర్టిఫికేట్లు, గూగుల్ క్లౌడ్ జెన్ ఏఐ లెర్నింగ్ పాత్‌ల కోసం స్కాలర్‌షిప్‌లు ఇస్తారు. గూగుల్ రూపొందించిన ఈ వృత్తిపరమైన శిక్షణ ద్వారా అగ్రశ్రేణి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను పొందే వీలుంటుంది. దీని ద్వారా కృత్రిమ మేధ ప్రాథమిక అంశాలు, బాధ్యతాయుతమైన విధానాలు అందరికీ అందుబాటులోకి వస్తాయి. ఎంపికైన అభ్యర్థులు సుమారు 33 గంటల పాటు ఆన్‌లైన్ శిక్షణ పొందుతారు. ఇందులో జెనరేటివ్ కృత్రిమ మేధ ప్రాథమిక అంశాలు, ప్రాంప్టింగ్ మెళకువలు, బాధ్యతాయుతమైన ఏఐ విధానాలపై సమగ్ర అవగాహన కల్పిస్తారు. ఈ పాఠ్య ప్రణాళికలో భాగంగా గూగుల్ కెరీర్ సర్టిఫికేట్లు, గూగుల్ క్లౌడ్ జెనరేటివ్ ఏఐ లెర్నింగ్ పాత్‌లను అభ్యర్థులు నేర్చుకోవచ్చు. దీనివల్ల వాస్తవ పరిస్థితుల్లో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించేందుకు అవసరమైన కీలక జ్ఞానాన్ని, నైపుణ్యాలను అభ్యాసకులు సొంతం చేసుకుంటారు. తొలి దశను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులు, ఆచరణాత్మక నైపుణ్యాలపై దృష్టి సారించే అధునాతన శిక్షణకు ఎంపికవుతారు. హైబ్రిడ్ విధానంలో సాగే ఈ దశలో కథా రచన, సృజనాత్మక నిర్మాణం, అధునాతన కృత్రిమ మేధ పరికరాల వినియోగంపై ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం ఉంటుంది. ఐఐసీటీ, యూట్యూబ్ సంయుక్తంగా రూపొందించిన ఈ పాఠ్య ప్రణాళికలో, కంటెంట్ విస్తృతిని, వీక్షకుల భాగస్వామ్యాన్ని పెంచే మెళకువలను కూడా నేర్పిస్తారు. గూగుల్ డెవలపర్స్ కోడ్‌ల్యాబ్స్ వంటి మార్గదర్శక మాడ్యూళ్ల ద్వారా అభ్యర్థులు వివిధ రకాల సాధనాలు, వేదికలపై పట్టు సాధిస్తారు.

ఈ కార్యక్రమానికి 'ఏఐ స్కిల్స్ హౌస్' వేదిక కూడా మద్దతునిస్తుంది. ఇది జెనరేటివ్ కృత్రిమ మేధ అప్లికేషన్లు, వర్క్‌ఫ్లో ఆటోమేషన్, నిర్ణయం తీసుకునే సాధనాలతో సహా సులభంగా అందుబాటులో ఉండే క్రమబద్ధమైన అభ్యాస మార్గాలను అందిస్తుంది. సాంకేతిక నైపుణ్యాన్ని సృజనాత్మకతతో జోడించడం ద్వారా వేగంగా అభివృద్ధి చెందుతున్న మీడియా, డిజిటల్ రంగంలో ఆవిష్కరణలు చేయగల నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులను తయారు చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం.

దేశ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్న ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా ప్రధాన స్రవంతి కంటెంట్ సృష్టి, నిర్మాణ ప్రక్రియల్లో కృత్రిమ మేధను అంతర్భాగం చేసే దిశగా ఈ కార్యక్రమం ఒక కీలక ముందడుగు. మీడియా, వినోదం, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కథా రచన రంగాల్లో అపార నైపుణ్యం కలిగిన వారిని గుర్తించి, వారిని కృత్రిమ మేధ రంగంలో నిపుణులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ కార్యక్రమం రూపొందించారు.

ఈ ప్రాజెక్టు అమలు బాధ్యతలను స్వీకరించిన ఐఐసీటీ దేశవ్యాప్తంగా పాఠ్యప్రణాళిక రూపకల్పన, అభ్యర్థుల ఎంపిక, శిక్షణా కార్యక్రమాల నిర్వహణను పర్యవేక్షిస్తోంది. గూగుల్, యూట్యూబ్ సహకారంతో రూపొందించిన ఈ పాఠ్యప్రణాళికలో అధునాతన ఏఐ పరికరాలు, సృజనాత్మక కార్యప్రవాహాలు, వేదిక స్థాయి మెళకువలను పొందుపరిచారు. తద్వారా అభ్యర్థులు ప్రారంభం నుంచి ఉత్పత్తికి సిద్ధంగా ఉండే, పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా పనిచేసే నైపుణ్యాన్ని సాధిస్తారు.

ఐఐసీటీ సీఈఓ డాక్టర్ విశ్వాస్ దేవోస్కర్ మాట్లాడుతూ.. కంటెంట్ సృష్టి, నిర్మాణం, పంపిణీ వంటి రంగాల్లో కృత్రిమ మేధను వాస్తవ పరిస్థితుల్లో ఉపయోగించేలా సృజనాత్మక నిపుణులను సిద్ధం చేయడం ద్వారా జాతీయ అవసరాలను తీర్చేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు.

# న్యూఢిల్లీలో రెండు రోజుల జాతీయ కార్యశాలలో నాణ్యమైన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, డిజిటల్ సాధనాలపై దృష్టి

న్యూఢిల్లీ, మే 5:పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ కార్యశాల ఇవాళ న్యూఢిల్లీలో ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (2026-27) తయారీకి ఉద్దేశించిన ప్రజల ప్రణాళిక ప్రచార కార్యక్రమ (పీపీసీ) కరపత్రం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) నాణ్యతను పెంపొందించే కమిటీ నివేదిక, నూతనంగా తీర్చిదిద్దిన ఈ-గ్రామ స్వరాజ్ ప్రణాళికా పోర్టల్‌ను కూడా ఆవిష్కరించారు. భాగస్వామ్య ప్రణాళికను బలోపేతం చేయటం, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల నాణ్యతను మెరుగుపరచటం, తద్వారా వాటిని మరింత సమర్థవంతంగా, సమ్మిళితంగా, ఫలితాల ఆధారంగా తీర్చిదిద్దటం ఈ కార్యశాల లక్ష్యం. ఈ కార్యశాలకు కేంద్ర మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు, పంచాయతీ రాజ్ శాఖలు, ఎస్ఐఆర్ డీ, పీఆర్ ప్రతినిధులు, పంచాయతీ కార్యకర్తలు, దేశవ్యాప్తంగా ఉన్న ఇతర కీలక భాగస్వాములు హాజరయ్యారు.

పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ వివేక్ భరద్వాజ్ ప్రసంగిస్తూ.. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) తయారీపై కీలక సూచనలు చేశారు. దీన్ని కేవలం ఒక అధికారిక నిబంధనగా భావించకూడదని, క్షేత్రస్థాయిలో నిజమైన మార్పును తీసుకువచ్చే నాణ్యమైన ఫలితాలపైనే దృష్టి పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. జీపీడీపీ ద్వారా ఆస్తుల కల్పనకు సరైన ప్రణాళికను రూపొందించటం వల్ల వనరుల వృథాను అరికట్టవచ్చని పేర్కొన్నారు. స్థిరత్వం, స్పష్టమైన సంస్థాగత బాధ్యతలు, వనరుల సమర్థవంతమైన వినియోగం ద్వారా పంచాయతీల నేతృత్వంలోని ప్రణాళికా రచనను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని శ్రీ భరద్వాజ్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో దీర్ఘకాలిక సేవలందించటంలో డిజిటల్ వేదికల పాత్రను కూడా ఆయన వివరించారు. గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం పెరగటం వల్ల నిర్ణయాధికారం మరింత సమగ్రంగా ఉంటుందని ఆయన చెప్పారు.

జల శక్తి మంత్రిత్వ శాఖలోని తాగునీరు, పారిశుద్ధ్య విభాగం (డీడీడబ్ల్యూఎస్) కార్యదర్శి శ్రీ అశోక్ కె.కె. మీనా ప్రసంగిస్తూ.. జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) పథకాలు దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు దోహదపడ్డాయన్నారు. ఇప్పుడు మన దృష్టి ఈ ఆస్తుల నిరంతర నిర్వహణ, సంరక్షణ, వాటి సమర్థవంతమైన వినియోగంపైకి మళ్లాలని సూచించారు. స్థానిక అవసరాలపై పూర్తి అవగాహన ఉన్న గ్రామ పంచాయతీలే సేవలందించటంలో కీలక పాత్ర పోషించాలని స్పష్టం చేశారు. మెరుగైన ప్రాథమిక సేవలందించటంలో బలమైన స్థానిక ప్రణాళిక అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు (జీపీడీపీలు) కేవలం కాగితాలకే పరిమితం కాకుండా... వనరుల వినియోగం, ఆస్తుల నిర్వహణ, డిజిటల్ పారదర్శకతను జోడిస్తూ, క్రియాశీలకంగా, ఫలితాల ఆధారితంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. జవాబుదారీతనాన్ని పెంచేందుకు వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అవసరమని, డిజిటల్ సాధనాలను ఎక్కువగా ఉపయోగించాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించటానికి పంచాయతీలు, గ్రామ ఆరోగ్య, పారిశుద్ధ్య కమిటీల బలోపేతం, పంచాయతీలు సొంత ఆదాయ వనరులను పెంచుకోవటం, నిర్వహణ, మరమ్మత్తులను స్థానిక ప్రణాళికల్లో అంతర్భాగం చేయటం వంటి అంశాల అవసరాన్ని స్పష్టం చేశారు.

పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ సుశీల్ కుమార్ లోహాని మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) మారుతున్న తీరును, నాణ్యమైన, అంశాల వారీగా ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ మళ్లీ మళ్లీ ఒకే రకమైన పనులను చేయటం, కేంద్ర, రాష్ట్ర పథకాల మధ్య సమన్వయ లోపం కారణంగా ఆశించిన ఫలితాలు రావటం లేదన్నారు. 16వ ఆర్థిక సంఘం ద్వారా గ్రామీణ స్థానిక సంస్థలకు (ఆర్ఎల్ బీలు) కేటాయింపుల్లో 84 శాతం పెరిగినట్లు తెలిపారు. కేంద్ర నిధులు కేవలం అనుబంధమైనవి మాత్రమేనని.. రాష్ట్ర ఆర్థిక సంఘం ఇచ్చే నిధులకు, స్థానిక సంస్థల సొంత ఆదాయానికి ప్రత్యామ్నాయం కాదని ఆయన స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) వికేంద్రీకృత ప్రణాళికకు ఒక శక్తివంతమైన సాధనమని ఆయన అభివర్ణించారు. ఇకపై నాణ్యతపైనే ప్రధానంగా దృష్టి సారిస్తామని, ఇందుకోసం నిపుణుల కమిటీ రూపొందించిన 15 సూచికల ఆధారంగా నాణ్యతను మెరుగుపరుస్తామని తెలిపారు. నూతనోత్సాహంతో జీపీడీపీ శిక్షణపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు.

16వ ఆర్థిక సంఘం నిధుల వ్యవస్థపై పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి ముక్తా శేఖర్ సమగ్ర అవగాహనను కల్పించారు. పంచాయతీ రాజ్ సంస్థలను బలోపేతం చేయటానికి ఈ నిధుల కేటాయింపులో అనుసరిస్తున్న సంస్కరణాత్మక విధానాన్ని ఆమె స్పష్టం చేశారు. స్థానిక సంస్థలకు మద్దతిచ్చేందుకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలతో నిధులను అనుసంధానిస్తూ.. 2026-31 సంవత్సరాలకుగానూ రూ. 4.35 లక్షల కోట్లు కేటాయించినట్లు ఆమె వెల్లడించారు. పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థవంతమైన క్షేత్రస్థాయి పాలనను నిర్ధారించేందుకు, ఈ-గ్రామ్ స్వరాజ్, ఆడిట్ ఆన్‌లైన్ పోర్టల్స్ లో చేరటం, రాష్ట్ర ఆర్థిక సంఘాలను బలోపేతం చేయటం, సమర్థ వేదికను అనుసంధానించటం, ఓఎస్ఆర్ రిపోర్టింగ్‌ను మెరుగుపరచటం వంటి కీలక కార్యాచరణ అంశాలను కూడా ఆమె వివరించారు.

సాంకేతిక సెషన్‌తో కార్యశాల మొదటి రోజు ప్రారంభమైంది. ఇందులో ఇతివృత్తంతో కూడిన, అధిక-నాణ్యత గల పీడీపీలను సిద్ధం చేసేందుకు వ్యూహాత్మక విధానాలు, 16వ ఆర్థిక సంఘం అన్‌టైడ్ నిధులు, వాటి షరతులను అర్థం చేసుకోవటం, స్వయం సహాయక బృందాల ద్వారా గ్రామ పేదరిక నిర్మూలన ప్రణాళిక (వీపీఆర్ పీ)ను జీపీడీపీతో అనుసంధానించటం, పీఈఎస్ఏ జీపీడీపీ తయారీ, పునరుద్ధరించిన ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్, గ్రామ మంచిత్రపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు జరిగాయి. రెండో రోజున సాక్ష్యాధారిత ప్రణాళికలో పంచాయతీ అభివృద్ధి సూచిక (పీఏఐ)ను ఏకీకృతం చేయటంపై ప్రజెంటేషన్లు ఉంటాయి. అనంతరం పునరుద్ధరించిన పోర్టల్‌లో జీపీడీపీ తయారీకి సంబంధించి వివిధ రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల బృందాలు అనుభవాలను పంచుకుంటాయి.

# సబ్ రిజిస్ట్రార్ కోసం డబ్బులు వసూలు.. డ్రైవర్ అరెస్ట్

ఖమ్మం, మే 5: బూర్గంపహాడ్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఖదీర్ కోసం డబ్బులు వసూలు ఆయన ప్రైవేట్ డ్రైవర్ ఫహీంను ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ మంగళవారం ఖమ్మం ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రమైన బూర్గంపహాడ్‌లో గతంలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఖదీర్ పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఏసీబీకి సైతం పలు ఫిర్యాదులు రావడంతో గత ఏడాది జూన్‌లో ఏసీబీ అధికారులు కార్యాలయంలో దాడులు చేసి తనిఖీలు నిర్వహించి ఫోన్ పే ద్వారా నగదు బదిలీ జరిగినట్లు గుర్తించడంతో పాటు ప్రైవేట్ వ్యక్తుల ద్వారా కార్యకలాపాలు నిర్వహించినట్లు గుర్తించారు. ఆ తర్వాత సబ్ రిజిస్ట్రార్ భద్రాచలానికి బదిలీ కావడంతో సంఘటన జరిగిన కొద్దిరోజుల్లోనే అతడిని కూడా ఏసీబీ అధికారులు పట్టుకుని ఏసీబీ కోర్టుకు తరలించారు.

అయితే బూర్గంపహాడ్‌లో జూన్‌లో జరిగిన ఏసీబీ దాడుల్లో సబ్ రిజిస్ట్రార్ ప్రైవేట్ డ్రైవర్‌కు సంబంధించిన కేసును విచారణ చేపట్టిన అధికారులు ఫోన్ పే ద్వారా నగదు బదిలీలు జరిగిన విషయాన్ని ధృవీకరించి తాజాగా ఖమ్మంలో డ్రైవర్ ఫహీంను అరెస్ట్ చేసి ఖమ్మం ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ఫహీం ముందుగా తన ఖాతాలో నగదు బదిలీ చేయించుకుని ఆ తర్వాత సబ్ రిజిస్ట్రార్‌కు ఇచ్చేవాడని విచారణలో తేలడంతో అరెస్టు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఏ అధికారైనా లంచం అడిగితే ఏసీబీ దృష్టికి తీసుకురావాలని, అలాంటి అవినీతి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

# యూఏఈపై జరిగిన దాడిని ఖండిస్తూ.. శాంతి, ప్రాంతీయ స్థిరత్వానికి మద్దతును పునరుద్ఘాటించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మే 5:యూఏఈపై జరిగిన దాడులను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ దాడుల్లో ముగ్గురు భారతీయులు గాయపడ్డారు.

పౌరులను, ప్రజా మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకోవడం ఆమోదయోగ్యం కాదన్నారు.

యూఏఈకి సంఘీభావంగా భారత్ దృఢంగా నిలబడుతుందనీ, చర్చలు, దౌత్యం ద్వారా అన్ని సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకొనేందుకు తను మద్దతును పునరుద్ఘాటిస్తుందనీ శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ప్రాంతీయంగా శాంతిని, స్థిరత్వాన్ని, అంతర్జాతీయ ఇంధన భద్రతను కొనసాగించేందుకు హార్మూజ్ జలసంధి ద్వారా సురక్షితమైన, నిరాటంకమైన నౌకాయానానికి భరోసా ఇవ్వడమే కీలకమని స్పష్టం చేశారు.

"యూఏఈపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ దాడుల్లో ముగ్గురు భారతీయులు గాయపడ్డారు. పౌరులను, మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకోవడం ఆమోదయోగ్యం కాదు.

యూఏఈకి సంఘీభావంగా భారత్ దృఢంగా నిలబడుతుంది. చర్చలు, దౌత్యం ద్వారా అన్ని సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకొనేందుకు తన మద్దతును పునరుద్ఘాటిస్తోంది.

ప్రాంతీయంగా శాంతిని, స్థిరత్వాన్ని, అంతర్జాతీయ ఇంధన భద్రతను కొనసాగించేందుకు హార్మూజ్ జలసంధి ద్వారా సురక్షితమైన, నిరాటంకమైన నౌకాయానానికి భరోసా ఇవ్వడం కీలకం"

# వేంపల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో కాలిన మొక్కజొన్న పంట

కరీంనగర్, మే 5: పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి కంటికి రెప్పలాగా కాపాడిన మక్కజొన్న పంట కండ్ల ముందే ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో కాలిబూడిదైందంటూ జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన గుమ్ముల లత అనే మహిళ రైతు రోదిస్తు తన ఆవేదనను వ్యక్తం చేసింది. గ్రామశివారులో తమకు ఉన్న ఒక ఎకరం ఇరవై గుంటల భూమిలో వండించిన మక్కజొన్న పంటను కోసి తమ భూమిలోనే ఓ చోట రాశులుగా పోసిన మక్కజొన్న కంకుల కుప్పకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో అగ్నిప్రమాదం వాటిల్లడంతో, ప్రమాదానికి కంకులు కాస్తా కాలిపోయాయి.

ఈ విషయంను తెలుసుకున్న స్థానిక రైతులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికి ఎలాంటి ఫలితం లేకపోయింది. కాలిపోయిన కంకుల కుప్ప వద్ద సదరు రైతు లత రోదిస్తు చేతికి వచ్చిన పంటకు పెట్టుబడి పోను నాలుగు పైసలు వస్తాయన్న తరుణంలో కండ్ల ముందే కాలిపోయి పంట కనిపించడం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.75 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని సర్కార్ తమ కుటుంబంను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలంను రెవిన్యూ శాఖ ఆర్ఐ అశోక్ పరిశీలించి నష్టపోయిన వివరాలను ఉన్నత అధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో



యాదాద్రి భువనగిరి, మే 5: ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. చేతికొచ్చిన పంట కండ్ల ముందే వర్షార్పణం అవుతుంటే కడుపుమండిన రైతులు రోడ్లపై కొచ్చి ఆందోళనలు చేపడుతున్నారు.

తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# ఐటీసీ యాజమాన్యానికి కార్మిక జేఏసీ రిమైండర్ సమ్మె నోటీస్



న్యూఢిల్లీ, మే 5: కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే ఏ క్షణమైనా సమ్మెకు సిద్ధంగా ఉన్నామని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో-కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, ఎండీ.యాకూబ్‌పాషా, ఆకిని సర్వేశ్వరరావు, బల్లెం నాగయ్య స్పష్టం చేశారు. మంగళవారం కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కానీపక్షంలో ఐటీసీ యాజమాన్యం స్పందించాలని రిమైండర్ సమ్మె నోటీసు మరోసారి హెచ్‌ఆర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక సమస్యలు, వేతన ఒప్పంద పెండింగ్ సమస్యలపై ఫిబ్రవరి 11న లేబర్ డిపార్ట్‌మెంట్‌కు నోటీసు ఇచ్చామని, అయినప్పటికీ యాజమాన్యం, లేబర్ డిపార్ట్‌మెంట్ కార్మిక జేఏసీతో ఎలాంటి చర్చలు జరపకుండా 14వ వేతన ఒప్పందం గుర్తింపు సంఘంతో కలిసి ఏకపక్షంగా చర్చలు జరిపి కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందం పూర్తి చేశారని సమాచారం అందిందన్నారు.

ఈ వేతన ఒప్పందంలో కార్మికులు అడిగిన డిమాండ్లు పరిష్కరించకుండా సరైన న్యాయం జరగకపోతే జనరల్ బాడీ మీటింగ్ తర్వాత ఏ క్షణమైనా సమ్మెకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని, దీనికి యాజమాన్యం, లేబర్ కమిషనర్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. తొలుత 41వ రోజు చేపట్టిన దీక్షలకు బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి, శ్రమశక్తి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బీఆర్టీయూ అధ్యక్షుడు కుందూరు పెద్దిరెడ్డి, ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకుడు మారం వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ దీక్షా కార్యక్రమంలో జేఏసీ బాధ్యులు, జేఏసీ సభ్యులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ లక్ష్యాన్ని నడిపిస్తున్న శక్తి అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలే

వికసిత్ భారత్ లక్ష్యాన్ని నడిపిస్తున్న శక్తి అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలే "మన రక్షణ రంగ ఫ్యాక్టరీల నుంచే భారత దేశ సైనిక శక్తి ఉద్భవిస్తోంది" అని రక్షణ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేథ్ అన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన అత్యాధునిక ఆయుధాలు, ఆయుధ వ్యవస్థల సామర్థ్యంతో బలోపేతమైన రక్షణ బలగాల అసమానమైన ధైర్యం, సంకల్పమే ఆపరేషన్ సిందూర్ విజయానికి కారణమన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న నార్త్ టెక్ సింపోజియంలో 2026 మే 5న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ భారత దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంఎస్ఎంఈలే వెన్నెముక అని, అంకుర సంస్థలే దేశానికి బ్రాండ్ అంబాసిడర్లని అన్నారు. "భవిష్యత్తు వృద్ధిని నడిపించేది మన అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలే. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతను నెరవేర్చడంలో కీలకపాత్ర పోషించే ఆధునిక విశ్వకర్మలు ఇవి" అని అన్నారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉగ్రవాదుల స్థావరాలను నిర్మూలించి, భారత దేశ శత్రువుల కుయుక్తులను భగ్నం చేసిన రక్షణ బలగాలను రక్షణ శాఖ సహాయ మంత్రి ప్రశంసించారు.

రక్షణ రంగంలో ఆత్మనిర్భరతను సాధించాలనే మొత్తం దేశం - ప్రభుత్వం, డీపీఎస్‌యూలు, ప్రైవేటు రంగం, ముఖ్యంగా ఆవిష్కర్తలు, అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈల సంకల్పానికి మేడ్ ఇన్ ఇండియా సాధనాల సమర్థ వినియోగమే నిదర్శనమన్నారు.

దేశ ప్రయోజనాలను కాపాడేలా తన సొంత సామర్థ్యాలను బలోపేతం చేసుకోవాలని విశ్వసించే నవ భారత ఆవిర్భావానికి రికార్డు స్థాయిలో నమోదైన రక్షణ ఉత్పత్తి, రక్షణ ఎగుమతుల గణాంకాలే నిదర్శనమని రక్షణ శాఖ సహాయ మంత్రి స్పష్టం చేశారు. "ఈ నవ భారతం ఎవరికీ చెడు చేయాలని ప్రయత్నించదు. తన సార్వభౌమత్వానికి ముప్పు కలిగించాలని ప్రయత్నించేవారిని విడిచిపెట్టదు" అని చెప్పారు.

ఈ రోజు వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం రేపు ఉపయోగించకపోవచ్చని రక్షణ శాఖ సహాయ మంత్రి అన్నారు. అంతర్జాతీయంగా అనిశ్చితులు నెలకొన్న ఈ తరుణంలో వినూత్నంగా ఆలోచించి సాంకేతికంగా ముందంజలో ఉండేందుకు కృషి చేయాలని పరిశ్రమలను కోరారు. దేశంలో రక్షణ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఆవిష్కరణ నిరంతరాయంగా కొనసాగే ప్రక్రియ అనీ, దీనికి పూర్తి ప్రభుత్వ సహకారం ఉంటుందనీ చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని రక్షణ పారిశ్రామిక కారిడార్ తీసుకొచ్చిన గుణాత్మక ప్రభావాన్ని గుర్తించారు. ఈ ప్రగతిని ఉన్నత శిఖరాలకు చేర్చాలని పరిశ్రమను కోరారు.

నూతన రంగాల్లో ప్రస్తుతం కార్యాచరణ అవసరాలను తీర్చడానికి, భారత ఆర్మీని భవిష్యత్తు అవసరాలకు తగినట్టుగా సిద్ధం చేయడానికి రక్షణ బలగాలతో కలసి పనిచేయాలని పరిశ్రమలను జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ (జీవోసీ-ఇన్-సీ), సెంట్రల్ కమాండ్ లెఫ్టినెంట్ జనరల్ అనింద్య సేన్ గుప్త అభ్యర్థించారు. స్వావలంబనే వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి, సాంకేతిక సార్వభౌమత్వానికి, కార్యాచరణ రూపకల్పనకు దారి తీస్తుందన్నారు.

మూడు రోజుల పాటు జరిగే నార్త్ టెక్ సింపోజియం-2026ను భారత ఆర్మీకి చెందిన ఉత్తర, మధ్య సైనిక విభాగాలు, ఎస్ఐడీఎం నిర్వహిస్తున్నాయి. "రక్షణ త్రివేణీ సంగమం- సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమ, సైనిక సామర్థ్యాలు కలిసే చోటు" అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. దీనిని 2026 మే 4న రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. అత్యాధునిక రక్షణ రంగ సాంకేతికతను ప్రదర్శించేందుకు ప్రైవేటు రక్షణ ఉత్పత్తుల తయారీదారులు 284 స్టాళ్లను ఏర్పాటు చేశారు. మానవ రహిత ఏరియల్ వాహనాలు (యూఏవీలు), డ్రోన్లు, కౌంటర్ యూఏవీలు, అన్ని భూతల వాహనాలు, నిఘా సాధనాలు, ఇతర రక్షణ ఉత్పత్తులను సైతం ఈ కార్యక్రమంలో ప్రదర్శిస్తారు.

జీవోసీ-ఇన్-సీ ఉత్తర కమాండ్ లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ, 1 కోర్స్ జీవోసీ లెఫ్టినెంట్ జనరల్ వీ హరిహరన్, భారత రక్షణ తయారీదారుల సంఘం (ఎస్ఐడీఎం) అధ్యక్షుడు శ్రీ అరుణ్ టీ రాంచందానీ, పరిశ్రమ దిగ్గజాలు, ఆవిష్కర్తలు, అంకుర సంస్థలు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' మార్గదర్శక నిర్దేశంలో సమ్మిళిత అభివృద్ధికి భారత్ కట్టుబడి ఉందని స్పష్టం చేసిన శ్రీ నడ్డా

న్యూఢిల్లీ, మే 5:ఆరోగ్య రక్షణపై భారత్, జపాన్ మూడో సంయుక్త కమిటీ సమావేశాన్ని భారత్ మండపంలో ఈ రోజు నిర్వహించారు. భారత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా, జపాన్ ఆరోగ్య రక్షణ విధాన ఇన్‌చార్జి మంత్రి కిమి ఒనోడా ఈ సమావేశానికి సంయుక్తంగా అధ్యక్షత వహించారు.

కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీమతి పుణ్య సలిల శ్రీవాస్తవ జపాన్ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. పరస్పర గౌరవం, నమ్మకం, భవిష్యత్తుపై ఉమ్మడి దృక్పథం భారత్, జపాన్ భాగస్వామ్యానికి ప్రాతిపదికలని ఆమె అన్నారు. భారత్ – జపాన్ సహకార ఒప్పందం కింద జరిగిన ఈ సంయుక్త కమిటీ సమావేశం.. నిరంతర చర్చలు, బలమైన పరస్పర అవగాహనలతో ద్వైపాక్షిక సంబంధాన్ని బలోపేతం చేసుకునేందుకు ముఖ్య వేదికగా నిలిచిందని ఆమె వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో జరిగే చర్చలు నిర్మాణాత్మకంగా, భవిష్యత్ ఆశాజనకంగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా శ్రీ నడ్డా మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడానికి, సరికొత్త భాగస్వామ్యాలను ప్రోత్సహించడానికి ఇరు దేశాలకు ఉన్న ఉమ్మడి అంకితభావాన్ని ఈ సమావేశం ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు. ఆరోగ్యం, సంక్షేమంపై సహకార ఒప్పందం ఆధారంగా భారత్ – జపాన్ మధ్య ఆరోగ్య రక్షణ సహకారం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడం, వైద్య సేవలను అందరికీ అందుబాటులోకి తేవడం, మెరుగైన ఆరోగ్య ఫలితాల దిశగా ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఇరు దేశాల ఉమ్మడి లక్ష్యాలు ఈ సహకారానికి ప్రాతిపదికలని స్పష్టం చేశారు.

శతాబ్ద కాలానికి పైగా వివిధ రంగాల్లో కొనసాగుతున్న సంబంధాల వల్ల భారత్, జపాన్ మధ్య బహుముఖీనమైన, సుదీర్ఘమైన అనుబంధం ఏర్పడిందని శ్రీ నడ్డా వివరించారు. 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' మార్గదర్శక సూత్రంగా సమ్మిళిత అభివృద్ధికి భారత్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ఆరోగ్య రక్షణ రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఈ సంయుక్త కమిటీ సమావేశం ఒక కీలక వేదికగా ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ.. నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, పరిశోధనల ద్వారా ఆరోగ్య రంగ సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంలో జపాన్ ఎల్లప్పుడూ భాగస్వామిగా ఉంటుందని ఆ దేశ మంత్రి ఒనోడా పునరుద్ఘాటించారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు తమ దేశం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు.

పెరుగుతున్న వ్యాధుల తీవ్రతను, ముఖ్యంగా అసాంక్రమిక వ్యాధుల ఉధృతి పెరుగుతుండడాన్ని భారత్ బృందం వివరించింది. వీటిని అరికట్టడానికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నిరంతర సంరక్షణ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా నిరంతర ఆరోగ్య రక్షణ కార్యక్రమాలతో కూడిన సమగ్ర కార్యాచరణను వారు వివరించారు. మరోవైపు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, ముందస్తు వ్యాధి గుర్తింపు, సాంకేతిక సహకారం – సంస్థాగత సామర్థ్యాభివృద్ధి ద్వారా చికిత్స వ్యవస్థలను బలోపేతం చేసే ప్రాజెక్టులు సహా.. జపాన్ సహకారంతో చేపట్టిన వివిధ కార్యక్రమాల వివరాలను ఆ దేశ ప్రతినిధులు వెల్లడించారు.

ఔషధ, వైద్య పరికరాల రంగాల విస్తృతిని, సామర్థ్యాన్ని ఈ సందర్భంగా భారత బృందం వివరించింది. ముఖ్యంగా దేశీయంగా తయారీని బలోపేతం చేయడం, ఇతర దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించడం, కచ్చితమైన విధాన చర్యల ద్వారా తక్కువ ధరకే అందేలా చూడడంపై భారత్ ప్రధానంగా దృష్టి సారించింది. ఇక జపాన్ విషయానికి వస్తే.. ఔషధ ఉత్పత్తులు, సేవలను మెరుగుపరచడానికి, సరఫరా వ్యవస్థలను పటిష్టం చేయడానికి, వ్యవస్థీకృత భాగస్వామ్యాల ద్వారా సాంకేతికతను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడానికి తాము అనుసరిస్తున్న ప్రభుత్వ – ప్రైవేట్ భాగస్వామ్య నమూనా గురించి ఆ దేశ ప్రతినిధులు వివరించారు.

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా భారత్ విస్తరిస్తున్న డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల విధానాన్ని మన దేశ ప్రతినిధులు వివరించారు. పరస్పర సమన్వయంతో, సురక్షితంగా, పౌరుల అవసరాలే కేంద్రంగా పనిచేసే ఒక డిజిటల్ ఆరోగ్య వ్యవస్థను రూపొందించి, ఏకీకృతం చేయడంలో భారత్ సాధించిన పురోగతిని తెలియజేశారు. మరోవైపు వివిధ వ్యవస్థల అనుసంధానం, ఏఐ ఆధారిత వైద్య సాంకేతికతలు, సరికొత్త డిజిటల్ వేదికల ద్వారా సాగుతున్న ఉమ్మడి పరిశోధనల పురోగతిలో తమ అనుభవాన్ని జపాన్ ప్రతినిధులు పంచుకున్నారు.

నైపుణ్యం కలిగిన, ప్రపంచ స్థాయి వైద్య సిబ్బందిని తీర్చిదిద్దడంలో తన విధానపరమైన, నియంత్రణ వ్యవస్థల ప్రాధాన్యాన్ని భారత్ వివరించింది. ఇరు దేశాల మధ్య ఆదానప్రదానాలు, ఉమ్మడి శిక్షణ, ఒకరి నైపుణ్యాలను మరొకరు గుర్తించేలా రూపొందించిన నిర్మాణాత్మక మార్గాలనూ వెల్లడించింది. మరోవైపు వైద్య రంగంలో ఉమ్మడి పరిశోధనలు, సిబ్బంది ఆదానప్రధానాలు, వైజ్ఞానిక సహకార కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు ప్రస్తుతమున్న ఒప్పందాల వివరాలను జపాన్ ప్రతినిధులు తెలియజేశారు.

ఈ చర్చలు భారత్ – జపాన్ ఆరోగ్య భాగస్వామ్యానికి నవోత్తేజాన్నిచ్చాయని, కీలక ప్రాధాన్య రంగాల్లో సహకారాన్ని మరింత పెంపొందించుకునేందుకు ఇరుదేశాలు కట్టుబడి ఉన్నాయని.. ప్రసంగం ముగింపు సందర్భంగా శ్రీ నడ్డా పేర్కొన్నారు. పటిష్టమైన, సమ్మిళిత ఆరోగ్య వ్యవస్థల బలోపేతం దిశగా ఈ చర్చలు స్పష్టమైన నిర్దేశాన్నిచ్చాయని స్పష్టం చేశారు.

ఈ సమావేశ ఫలితాలు సహకారాన్ని పెంపొందించుకోవడానికి బలమైన పునాదిగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా ఈ ఉమ్మడి లక్ష్యాన్ని అర్థవంతమైన ఫలితంగా మలిచేందుకు జపాన్‌తో కలిసి పనిచేయడానికి భారత్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

ఈ సహకారాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు జపాన్ కట్టుబడి ఉందని ఒనోడా స్పష్టం చేశారు. ఆరోగ్య రంగంలో భారత్ – జపాన్ ప్రత్యేక వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు జపాన్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

ప్రజలకు మెరుగైన ఆరోగ్య ఫలితాలను అందించే దిశగా ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై ఇరుపక్షాలు ఆశాభావం వ్యక్తం చేయగా.. సానుకూల వాతావరణంలో ఈ సమావేశం ముగిసింది.

# శాస్త్ర, సాంకేతిక వ్యవస్థలో నూతన అవకాశాలను కల్పిస్తున్న ప్రైవేటు భాగస్వామ్యం: డాక్టర్ జితేంద్ర సింగ్

దశాబ్ద కాలంగా శాస్త్ర, సాంకేతిక విభాగం (డీఎస్ టీ) ప్రోత్సహించిన సాంకేతిక ఆధారిత ఆవిష్కరణలే భారతదేశ ఆర్థిక పునరుజ్జీవనానికి కీలకమని... పరిశోధనల నుంచి పరిశ్రమలు, అంకుర సంస్థలు, జాతీయ వృద్ధి వరకు వీటి సహకారం విస్తరిస్తోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్ర శాఖ సహాయమంత్రి (స్వతంత్ర బాధ్యత), పీఎంఓ, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

పరిశోధనలు కేవలం ప్రయోగశాలలకే పరిమితం కాకుండా ఆర్థిక వృద్ధికి తోడ్పడాలన్న నూతన విధానాన్ని ప్రస్తావిస్తూ... సైన్స్ ఇకపై "ప్రయోగశాల నుంచి మార్కెట్ వరకు, ఆలోచన నుంచి ఆచరణాత్మక స్థాయి వరకు" సాగాలని మంత్రి పిలుపునిచ్చారు.

న్యూఢిల్లీలోని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఐఎన్ఎస్ఏ) ఆడిటోరియంలో జరిగిన శాస్త్ర, సాంకేతిక విభాగం (డీఎస్ టీ) 56వ వ్యవస్థాపక దినోత్సవంలో డాక్టర్ జితేంద్ర సింగ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్, డీఎస్ టీ కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరాండికర్ తో పాటు ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, శాస్త్రీయ రంగ ప్రముఖులు హాజరయ్యారు.

దశాబ్ద కాలంలో భారత శాస్త్ర, సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులొచ్చాయని... అంతరిక్షం, అణుశక్తి వంటి కీలక రంగాల్లో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయాలే ఇందుకు ప్రధాన కారణమని కేంద్రమంత్రి తెలిపారు. ఈ చర్యల ద్వారా అంకుర సంస్థలకు, పరిశ్రమలకు సరికొత్త అవకాశాలు లభించటం ద్వారా అపారమైన మానవ వనరులను భారత్ సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రపంచ ఆవిష్కరణల వ్యవస్థలో స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోందని పేర్కొన్నారు.

అంతరిక్ష రంగంలో వేగవంతమైన విస్తృతిని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. ఈ రంగంలో ప్రైవేటు భాగస్వామ్యానికి అవకాశమిచ్చిన కొద్ది సంవత్సరాల్లోనే అంకుర సంస్థల ఆధారిత ఆవిష్కరణల్లో భారత్ వృద్ధిని సాధించిందని, ఉపగ్రహ సాంకేతికత వంటి రంగాల్లో నూతన సామర్థ్యాలు పుట్టుకొస్తున్నాయని చెబుతూ, ఇవి ఆర్థిక వృద్ధికి, జాతీయ సంసిద్ధతకు దోహదపడుతున్నాయని అన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లోనూ ఈ వేగం కొనసాగుతోందని ఆయన తెలిపారు.

పరిశ్రమలు, ప్రైవేట్ రంగంతో సంబంధం లేకుండా ఏ దేశమూ సైన్స్ రంగంలో పురోగతి సాధించలేదని... ప్రభుత్వం, విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య లోతైన సహకారం అవసరమని కేంద్రమంత్రి అన్నారు. స్వదేశీ పరిశోధనల ప్రాముఖ్యతను స్పష్టం చేస్తూ ఫార్మాస్యూటికల్స్ వంటి కీలక రంగాలతో సహా వివిధ విభాగాల్లో భారత్ సొంత సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా అభివృద్ధి చేసుకుంటోందన్నారు.

అంతర్జాతీయంగా భారతదేశ శాస్త్రీయ స్థాయి గణనీయంగా బలపడిందని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రాచుర్యం గల పరిశోధనా పత్రాలు పెరగటం భారత పరిశోధనల నాణ్యతను, ప్రభావాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. పదేళ్ల కిందట కేవలం కొన్ని వందల సంఖ్యలో మాత్రమే ఉన్న అంకుర సంస్థలు.. నేడు రెండు లక్షలకు పైగా పెరిగాయి. ఇది మన దేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆవిష్కరణల రంగానికి నిదర్శనమని స్పష్టం చేశారు.

శాస్త్రీయ సంస్థలు విజయాలను క్రియాశీలంగా ప్రచారం చేయాలని, భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు జరపాలని మంత్రి స్పష్టం చేశారు. భాగస్వాములను ఆకర్షించేందుకు, సమాజంపై విస్తృత ప్రభావాన్ని చూపేందుకు ప్రాచుర్యం, ప్రచారం ఎంతో అవసరమన్నారు. ఆవిష్కర్తలను ప్రోత్సహించటంతో పాటు, యువ ప్రతిభావంతులకు స్పష్టత, వాస్తవికతతో దిశానిర్దేశం చేసే పారదర్శకమైన, ప్రతిభావంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయటం ముఖ్యమని చెప్పారు.

ప్రస్తుత సాంకేతిక అవసరాలకనుగుణంగా సంస్థలను తీర్చిదిద్దటం, పనితీరును మెరుగుపరచటం లక్ష్యంగా సాగుతున్న పరిపాలనా సంస్కరణల గురించి ఆయన ప్రస్తావించారు. ఇందులో భాగంగా పాత వ్యవస్థల పునర్నిర్మాణం, నిర్ణయాధికారంలో మరింత వికేంద్రీకరణ వంటి అంశాలున్నాయన్నారు.

పరిశోధనలను సాంకేతిక అభివృద్ధి, వాణిజ్యీకరణతో అనుసంధానించాల్సిన అవసరముందని ప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్ అన్నారు. భారతదేశ శాస్త్ర, ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేయటానికి ప్రభుత్వం చేపట్టిన అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆంఎఫ్), ఆర్ డీఐ ఫండ్, నేషనల్ క్వాంటం మిషన్ వంటి కీలక కార్యక్రమాలను కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం (డీఎస్ టీ) కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరాందీకర్ వివరించారు.

కొనసాగుతున్న సంస్కరణలు, పటిష్ఠమైన వ్యవస్థాగత నిర్మాణాలు, అన్ని వర్గాల భాగస్వామ్యంతో రాబోయే కాలంలో భారతదేశ ఆర్థిక వృద్ధిని, ప్రపంచ నాయకత్వాన్ని నిర్దేశించటంలో దేశీయ శాస్త్ర, సాంకేతిక రంగం నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందని డాక్టర్ జితేంద్ర సింగ్ ధీమా వ్యక్తం చేశారు.

# ఏపీ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది: సీఎం చంద్రబాబు

అమరావతి, మే 05: విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ గెజిట్‌ను విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ రైల్వే జోన్ ఏర్పాటు ద్వారా ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని తెలిపారు. మంగళవారం విశాఖపట్నం రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వ గెజిట్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. ఏపీ విజ్ఞప్తిని మన్నించి చరిత్రాత్మక గెజిట్‌ను విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.




2026, జూన్ 1వ తేదీ నుంచి విశాఖపట్నం కేంద్రంగా జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని సీఎం చంద్రబాబు వివరించారు. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస – ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ద్వారా ఉత్తరాంధ్ర రవాణా రంగం ముఖచిత్రాన్ని మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నూతనంగా ఏర్పాటైన విశాఖపట్నం డివిజన్, రాయగడ డివిజన్ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఏపీ సీఎం ఆకాంక్షించారు. రాష్ట్రాభివృద్ధికి.. ప్రత్యేకించి ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి ఈ రైల్వే జోన్ ఏర్పాటు దోహద పడుతుందని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

# అమెరికా విమానం మిస్సింగ్.. ఖతార్ పరిధిలో కనిపించకుండా పోయిన ఫ్లయింగ్ గ్యాస్ స్టేషన్




న్యూఢిల్లీ, మే 5:గాలిలోనే ఇంధనం నింపగల సామర్థ్యం ఉన్న అమెరికాకు చెందిన విమానం ఒకటి కనిపించకుండా పోయింది. బోయింగ్ కేసీ?135 స్ట్రాటోట్యాంకర్ అనే ఫ్లయింగ్ గ్యాస్ స్టేషన్‌గా పిలిచే విమానం ఇరాన్ సమీపంలోని పర్షియన్ గల్ఫ్ తీరంలో ప్రయాణిస్తుండగా గల్లంతైంది. గల్లంతు కావడానికి కొద్దిసేపటి ముందు ఎమర్జెన్సీ సిగ్నల్ అందించింది. ఒకపక్క మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ సంక్షోభం నెలకొన్నదృష్ట్యా ఈ విమానం కనిపించకుండా పోవడం ఆసక్తికరంగా మారింది. ఈ అమెరికా విమానం యూఏఈలోని అల్ దఫ్రా ఎయిర్‌బేస్ నుంచి బయల్దేరింది. ఖతార్ వద్ద ప్రయాణిస్తున్నప్పుడు సిగ్నల్ కోల్పోయింది. ప్రస్తుతం మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ సంక్షోభం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గల్ఫ్, ఇరాన్ ప్రాంతంలో మోహరించిన అమెరికా యుద్ధ విమానాలకు ఇంధనం నింపేందుకు ఈ విమానం సాయపడుతోంది. విమానం కనిపించకుండా పోవడానికి లేదా ఎక్కడైనా ఎమర్జెన్సీ ల్యాండింగ్ అవ్వడానికి ముందు గాలిలో కొద్దిసేపు గుండ్రంగా తిరిగినట్లు డాటా ద్వారా వెల్లడవుతోంది. ఈ విమానం కనిపించకుండా పోవడానికి గల కారణాలు ఇంకా తెలియలేదు. దీనిపై అమెరికా నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

అలాగే, ఈ ఘటనలో తమ ప్రమేయం గురించి ఇరాన్ కూడా ఎలాంటి ప్రకటనా చేయలేదు. అమెరికా మిలిటరీ కూడా దీనిపై స్పందించలేదు. గత మార్చిలో ఇరాన్ జరిపిన దాడుల్లో ఇలాంటి మరో కేసీ-135 విమానాన్ని అమెరికా ఇరాక్ భూభాగంలో కోల్పోయింది.

తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి ఈ దాడి చేశామని ఇరాక్ ప్రకటించింది. ఈ విమానం అమెరికన్ ఆర్మీకి చాలా కీలకమైంది. గాలిలోనే యుద్ధ విమానాల్లో ఇంధనం నింపగలదు.

అలాగే, సామగ్రిని, ప్రయాణికుల్ని కూడా మోసుకెళ్లగలదు. ఈ తరహా విమానాలు అమెరికా రక్షణ రంగంలో 60 ఏళ్లుగా సేవలందిస్తున్నాయి.

# సీఎం పదవికి రాజీనామా చేసిన ఎం.కె. స్టాలిన్

హైదరాబాద్, మే 5:తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్ తన పదవికి రాజీనామా చేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత, ఆయన గవర్నర్ రాజేంద్ర విశ్వనాథన్ అర్లేకర్‌కు తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసే వరకు ఆయన తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన సీఎం స్టాలిన్ పరాజయం పాలయ్యారు. కాగా, రెండు చోట్ల పోటీ చేసిన విజయ్ గెలుపొందడం విశేషం.

మరోవైపు మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ తమిళనాడులో అతిపెద్ద పార్టీగా అవతరించింది. మొత్తం 234 స్థానాల్లో 107 సీట్లను గెలుచుకొని విజయ ఢంకా మోగించింది. అధికార డీఎంకే కూటమి 74 స్థానాలకు పరిమితమయ్యింది. ఈ నేపథ్యంలో టీవీకే చీఫ్ విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

గవర్నర్‌కు లేఖ రాశారు. ఆయన అపాయింట్‌మెంట్ కోరారు. లోక్‌భవన్‌కు ఈమెయిల్ చేశారు. 108 స్థానాలతో టీవీకే సింగిల్ లార్జెస్ట్ పార్టీ అవతరించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అయితే సభలో తమ మెజారిటీని నిరూపించుకునేందుకు మరింత గడువును ఇవ్వాలని విజయ్ తన లేఖలో కోరినట్లు తెలుస్తోంది.


# బిహార్‌లో మంత్రివర్గ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు..

న్యూ ఢిల్లీ, మే 5: బిహార్‌లో సీఎంగా నితీష్ కుమార్ రాజీనామా అనంతరం సామ్రాట్ చౌదరి ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన సంగతి తెలిసిందే. బీజేపీ నుంచి సామ్రాట్ సీఎంగా ప్రమాణం స్వీకారం చేశారు. జేడీయూ నుంచి విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్ డిప్యూటీ సీఎంలుగా ఎన్నికైన సంగతి తెలిసిందే. గత నెలలోనే బీజేపీ, జేడీయూ ఆధ్వర్యంలో ఎన్‌డీయూ కూటమి నుంచి ప్రభుత్వ ఏర్పాటు పూర్తికాగా, ఇప్పుడు మంత్రివర్గ ఏర్పాటుకు ముహూర్తం ఖరారైంది.

మే 7, గురువారం మంత్రివర్గ విస్తరణ జరగబోతున్నట్లు తెలుస్తోంది. మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం బిహార్ రాజధాని పాట్నాలోని ప్రఖ్యాత గాంధీ మైదాన్‌లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇది కూటమి ప్రభుత్వం కాబట్టి, ఏ పార్టీకి ఎన్ని మంత్రి పదవులు కేటాయిస్తారు అనే ఆసక్తి నెలకొంది. నిబంధనల ప్రకారం బిహార్ అసెంబ్లీలో ముఖ్యమంత్రితో కలిసి 36 మందికి మంత్రులుగా అవకాశం ఉంది. తాజా సమాచారం ప్రకారం.. బీజేపీకి 12 మంత్రి పదవులు దక్కే అవకాశాలున్నాయి. అలాగే, కూటమిలో కీలక పార్టీ అయిన జేడీయూకు 11 మంత్రి పదవులు, రామ్ విలాస్‌కు చెందిన ఎల్‌జేపీకి 2 పదవులు, హెచ్ఏఎం, ఆర్ఎల్ఎం పార్టీలకు చెరో మంత్రి పదవికి అవకాశం ఉంది.

ఇంకో ఆరు మంత్రి పదవులకు అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఆ పదవుల్ని మాత్రం భర్తీ చేయడం లేదు. తర్వాతి మంత్రివర్గ విస్తరణలో ఆరు పదవుల్ని భర్తీ చేస్తారు. జేడీయూలో కీలక నేతలైన శ్వేతా గుప్తా, భగవన్ కుష్వాహా, రత్నేష్ సదా, షీలే మండల్, బూలో మండల్‌లకు పదవులు ఖాయంగా కనిపిస్తోంది. మంత్రివర్గ ఏర్పాటుపై ఇటీవల బిహార్ సీఎం సామ్రాట్ చౌదరి.. ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశారు. మంత్రివర్గం చర్చించి, ఆయన ఆమోదం తీసుకున్నారు.

# సీఎంకు ప్రజాప్రతినిధులు, డంపింగ్‌యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ వినతి




హైదరాబాద్, మే 5:డంపింగ్‌యార్డ్ సమస్యతో ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని, దుర్వాసన నుంచి శాశ్వత పరిష్కారం చూపి ఈ ప్రాంతవాసులకు న్యాయం చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజాప్రతినిధులు, డంపింగ్‌యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు విన్నవించారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిరి ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్‌ల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

అలాగే జవహర్‌నగర్, దమ్మాయిగూడకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని మాజీ మేయర్ మేకల కావ్య, మాజీ చైర్మన్ ప్రణిత వినతిపత్రంలో కోరారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత హరివర్ధన్‌రెడ్డి, డంపింగ్‌యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు శంకర్ నారాయణ, సమ్మిరెడ్డి, సంజీవరెడ్డి, స్వర్ణశ్రీనివాన్, పద్మాచారి తదితరులు పాల్గొన్నారు.

# "సైకో" పితామహుడు సిగ్మండ్ ఫ్రాయిడ్

ఆధునిక విజ్ఞానమనే మహా భవనానికి మూల స్తంభాలలో ఒకరు సిగ్మండ్ ఫ్రాయిడ్. వైద్య శాస్త్రానికి, వైద్య శాస్త్రజ్ఞులకు, మానసిక శాస్త్రజ్ఞులకు, మానసి క శాస్త్రాధ్యాపకులకు, తాత్వికులకు విజ్ఞాన ప్రదాత. జగమం తా సెక్స్ మయంగా చూసిన ఫ్రాయిడ్ ఒక శతాబ్దం పాటు ప్రపంచంలో ఎన్నో రంగాల్ని ప్రభావితం చేశాడు. ఐన్ స్టీన్, మార్క్స్, డార్విన్ కోవలో ఫ్రాయిడ్ ను చేర్చిన సందర్భా లు లేకపోలేదు. తన సుదీర్ఘ జీవితంలో అనేక వ్యతిరేక పరిస్థితుల్ని, కష్టాల్ని, దారిద్ర్యా న్ని, వాటివల్ల కలిగే నైరాశ్యాన్నీ ఎదుర్కొన్నా, తన అన్వేషణను మాత్రం దీక్షగా కొనసాగించి, మనకు మానసిక విశ్లేషణా పద్ధతి (ఖబఎఇఫ్రనీ ఒనిజీశ్రీఎబతిబ) స్వప్నాల అర్థాల ఆవిష్కరణ లాంటి విషయాలను అందించి న మహా మనీషి ఫ్రాయిడ్. ఎన్నో విజ్ఞాన గ్రంథాల, ఇతర వ్యాసాల, పరిశోధనల ఆధారం గా రచించలే కాక, విశేషంగా పర్యటిస్తూ, ఉపన్యాసాలు ఇస్తూ, చర్చా సదస్సులలో పాల్గొంటూ మానవ జాతికి జాగృతం చేసే చైతన్య వంతమైన జీవితం గడిపాడు. వైద్య శాస్త్రానికి, ప్రత్యేకించి మానసిక విశ్లేషణా పద్ధతికి ఆద్యుడయిన సిగ్మండ్ ఫ్రాయిడ్ జీవితం మానసిక వైద్యులకు మార్గ దర్శకం. మనిషి మనస్సు లో 'అ చేతనం' (అన్ కాన్షియస్ నెస్) అనేది ఉంటుంది. అది మన ప్రవర్తనను మనకు తెలియ కుండానే ప్రభావితం చేస్తుంది' అన్న ఫ్రాయిడ్ విశ్లేషణ.. మనస్తత్వ విశ్లేషణలో తారక మంత్రమైంది. సిగ్మండ్ ఫ్రాయిడ్ 1856, మే 6న జెకోస్లోవేకియాలోని ఫ్రీబెర్గ్‌లో జన్మించాడు. 1860లో వారి కుటుంబ మంతా వియన్నాకు తరలి పోయింది. పేదరికం లోనూ కష్టపడి చదివి గ్రీస్, లాటిన్, గణితం, ప్రకృతి శాస్త్రాలు, చరిత్రలను ఒంట పట్టించు కున్న ఫ్రాయిడ్.. 1873లో వియన్నా విశ్వ విద్యాలయంలో వైద్య శాస్త్రంలో చేరాడు. నాటికి అదే వైద్య శాస్త్రంలో ప్రపంచ రాజధాని. వియన్నా యూనివర్సిటీలో 1881లో ఫ్రాయిడ్ మెడిసిన్ డిగ్రీ పుచ్చుకున్నాడు. వియన్నా జనరల్ ఆస్పత్రిలోనే పనిచేశాడు. తరువాత 1883 నుంచీ నరాలపై దృష్టి పెట్టి అధ్యయ నం చేస్తూ నిపుణుడుగా తేలాడు. పారిస్ లో అప్పటికే జీమార్టిన్ చార్కాట్ సుప్రసిద్ధుడుగా వున్నాడు. ఫ్రాయిడ్ 1885లో చార్కాట్ వద్ద అధ్యయనం చేశాడు. (1885-1886) తరువాత మెదడుపై ప్రత్యేక పరిశీలన మొదలు పెట్టి, రచనకు పూను కున్నాడు. ఫ్రాయిడ్ యిష్టపడిందీ, అసలు చికిత్సగా నమ్మిందీ మనో విశ్లేషణ (సైకో ఎనాలసిస్). దీనివల్ల ఆయన పేరు, ప్రపంచ ఖ్యాతి వచ్చా యి. కొత్తపేర్లు ప్రచారంలోకి తేవడంలో, ఉపమానాలు వాడడంలో, గ్రీక్ రోమన్ గాథల నుండి ఉదాహరణల స్వీకరించ డంలో ఫ్రాయిడ్ దిట్ట. 30వ యేట నరాల జబ్బులను కుదిర్చే డాక్టర్ గా జీవితాన్ని ఆరంభించిన ఫ్రాయిడ్ అనువా దాలు, పుస్తక సమీక్షలు చేసేవాడు. విద్యుత్ చికిత్స, హిప్నాసిస్ (మోహనిద్ర) చికిత్సలు క్రమంగా విరమించి, కొత్త సిద్ధాంతంతో, సరికొత్త పదజాలంతో ఫ్రాయిడ్ తన ప్రాక్టీసు అవతారాన్నే మార్చేశాడు. ఆయనను ప్రపంచం గుర్తించింది. నరాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఫ్రాయిడ్ తన తొలి రచన 1891లో వెలువరించాడు. నరాల విషయంలో అది గొప్ప గ్రంథంగా పేరొందింది. 1883లో నరాల పరిశీలన ఆరంభించిన ఫ్రాయిడ్ 1897 వరకూ అందులో నిమగ్నుడయ్యాడు. ఫ్రాయిడ్ కొత్తగా వైద్యం ప్రాక్టీసు చేస్తున్న రోజులలో ఎలక్ట్రో థెరపీ వుండేది. "స్టడీస్ ఇన్ హిస్టీరియా" అనే రచనలో ఫ్రాయిడ్ "ఎలక్ట్రో థెరపీ" గురించి ప్రస్తావించాడు. ఫ్రాయిడ్ సెక్స్ సిద్ధాంతాలు ప్రపంచాన్ని బాగా ఆకర్షిం చాయి. గనేరియా, సిఫిలిస్ వంటి లక్షణాలు దృష్టిలో పెట్టుకొని ఫ్రాయిడ్ తన సెక్స్ సిద్ధాంతంలో వివరణ యిచ్చాడు. క్రమేణా "సైకో ఎనాలసిస్", అనే ఫ్రాయిడ్ సిద్ధాంతం పుంజుకున్నది. హిస్టీరియా, కలలు, కోర్కెల్ని అణచుకోవడం, చిన్న తనంలో సెక్స్, అచేతనం అనేవాటిని ఫ్రాయిడ్ ప్రచారంలోకి తెచ్చాడు. ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలోనే ఫ్రాయిడ్ తన సిద్ధాంత రచనలు లోకానికి చాటాడు. దీని ఆచరణకు ఉపక్రమించిన వారు సైకో ఎనాలసిస్ ను ఒక ఉద్యమంగా స్వీకరించారు. ఎదురు చెప్పడానికి భయపడ్డారు. ఫ్రాయిడ్ పలుకుబడి అలా వుండేది. మానసిక రుగ్మతులకు సరైన చికిత్స చేయడానికి దోహద పడే క్లినికల్ న్యూరాలజీకి సంబంధించి చాలా రకాల అధ్యయనం చేసిన ఫ్రాయిడ్.. న్యూరాలజీ, మెదడు పని చేసే విధానం గురించి అనేక పరిశోధక పత్రాలు ప్రచురిం చారు. "సైకో అనాలసిస్" అన్న పదం వాడిందీ, ఆ అంశం ఒక సబ్జెక్టుగా అభివృద్ధి చేసిందీ ఫ్రాయిడ్. సైకో అనాలసిస్‌ను ఫ్రాయిడ్ ఒక థెరపీగా ప్రతిపా దిస్తూ వ్యాసాలు రాశాడు. నరాల జబ్బుకు లైంగిక సంబంధమైన మూలం వున్నదని, సెక్స్ కారణాలుగా జబ్బులు వస్తాయని అనేక ఉపమా నాలు, కథలు, గ్రీకు గాథలు ఉదహరించి, విస్తారంగా వివరించాడు. "సైకో ఎనాల సిస్". అంటే "మనో విశ్లేషణ" ప్రపంచ ఉద్యమంగా వ్యాపించి, సంఘాలు వెలిశాయి. రోగిని మాట్లాడనిచ్చి, అతని పదాలలో అర్థాన్ని గూఢార్థాన్ని సంకేతాలను విప్పి చెప్పడం "సైకో ఎనాలసిస్ చికిత్స". ఈ విద్యలో ఫ్రాయిడ్ ఆరితేరిన వాడు. హిస్టీరియా అంటే ఏమిటి, అణచివేతకు అర్థం ఎలా చెప్పాలి, కలలు వాటి స్వభావం, చిన్నప్పటి సెక్స్ ప్రవృత్తి, అచేతనం బలం గురించి ఫ్రాయిడ్ చెప్పినవి ఆకర్షణీయంగా అంటుకు పోయాయి. సైకో ఎనాలసిస్ రంగంలో ఫ్రాయిడ్ సిద్ధాంతాలు ప్రచారంలో పెట్టడానికి యూంగ్ యాడ్లర్ కు తోడు, కార్ల్ అబ్రహం, విల్ హెల్మ్ స్టెకల్ వంటివారు బాగా కృషిచేశారు. ఫ్రాయిడ్ అనంతరం కారన్ హార్నే, హారీస్టాక్ సల్లివన్, ఎరిక్ ఫ్రాంలు యీ రంగంలో నిలిచి పనిచేశారు. ఫ్రాయిడ్ మూలా ధారం అవ్యక్త మనస్సు. అదే వ్యక్తుల్ని కదిలించి, నడిపించి, మాట్లాడిస్తుంది. అంటే మానవుడిని అవ్యక్త మనస్సు నిర్దేశిస్తుంది. మానవుడి ప్రవర్తన గురించి "ది సైకోపాథాలజీ ఆఫ్ ఎవ్విరిడే లైఫ్" లో ఫ్రాయిడ్ వివరించాడు. మెదడు పనితీరుపై అనేక పరిశోధనలు చేసి, ఆస్ట్రియా, జర్మనీ, ఫ్రాన్స్ లలో జీవించిన ఫ్రాయిడ్, తన చివరి రోజులలో హిట్లర్ నాజీ నియంతృత్వ ధోరణుల వల్ల ఇంగ్లాండ్ వెళ్ళి అక్కడే గడిపి కేన్సర్ తో 1939, సెప్టెంబరు 23న కన్ను మూశారు. "ది ఫ్యూచర్ ఆఫ్ ఇల్యూజన్" లో ఫ్రాయిడ్ మత విమర్శ చేశాడు. మతాన్ని ఆద్యంతాలు వ్యతిరేకించి, మతం అనేది ఒక భ్రమ అనీ, అయితే ఓదార్పు యిచ్చే విషయంగా అది పరిణ మించిందనీ ఫ్రాయిడ్ అన్నాడు. మతం నుండి బయట పడిన వారు, స్వేచ్ఛగా సంపూర్ణ జీవనం సాగించగలరని కూడా ఫ్రాయిడ్ చెప్పాడు. దీనితో మతస్తులు ఆయనపై విరుచుకు పడ్డారు. సనాతన మత నమ్మకాలు గల కుటుం బంలో పుట్టిన ఫ్రాయిడ్ తనకు నాస్తికుడుగా పేర్కొన్నాడు. కాని జీవితమంతా యూదుగానే వున్నాడు. ఇరవయ్యో శతాబ్దంలో మానసిక ప్రపంచం లోని అంశాల గురించి శోధించడానికి ఫ్రాయిడ్ చేసిన పరిశోధనలే మూలంగా ప్రచార మొందాయి.



మే 6... ఫ్రాయిడ్ జయంతి

ఫ్రాయిడ్ పరిశోధనలు విభిన్న రంగాలపై, ప్రాంతాలపై ప్రసరించాయి. సాహిత్య కళా రంగాలపై సైతం ఫ్రాయిడ్ ఆలోచనల ప్రభావం ఉంది.



**-రామ కిష్టయ్య సంగన భట్ల,**
9440595494

# హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఐక్యతతో ముందుకు కొనసాగాలి

## -బూరుగుపల్లి హిందూ సమ్మేళనంలో సురేష్ ఆత్మ రామ్ గురూజీ




కరీంనగర్, మే 5:(నేటినిజం ప్రతినిధి) హిందుత్వం మానవాళిహితమని, ధర్మ రక్షణకు సైనికులై కదలాలని , సంస్కృతి సాంప్రదాయాలను, సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవడానికి హిందూ సమాజం ఐక్యతతో ముందు కొనసాగాలని ఆధ్యాత్మిక గురువు సురేష్ ఆత్మరామ్ గురూజీ పిలుపునిచ్చారు. గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామంలో జరిగిన హిందూ సమ్మేళనంలో గురూజీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. హిందువు మతతత్వవాది కాదని స్పష్టం చేశారు. మతం వేరు, ధర్మం వేరని, హిందూ ధర్మాన్ని, సంస్కృతిని గ్రహించి ఆచరించాలన్నారు. కుటుంబం నుండి పరివర్తన కోసం మహిళలు పాటుపడాలని కోరారు. దేవాలయాలను శక్తివంతం చేయాలని, హిందువులు కులాల వారీగా విభజించబడడం హేయమని, హిందువులు సమైక్యంగా కలిసి జీవించాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ జిల్లా విభాగ్ బౌద్దిక్ ప్రముఖ్ సామల కిరణ్ మాటాడుతూ దేశంలో హిందూ సంఘటన కొరకు ఆర్.ఎస్.ఎస్ స్థాపన జరిగిందని తెలిపారు. హిందువులు స్వాభిమానం, దేశభక్తి, సేవాభావం పెంపొందించుకోవాలని సూచించారు. దేశభక్తి సంస్థ ఆర్ఎస్ఎస్ అని, దేశభక్తులను తయారుచేయటమే సంఘం లక్ష్మన్నారు. పంచ్ పరివర్తన సూత్రం ద్వారా కుటుంబాలలో మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కుటుంబ విలువలు సామాజిక సమరసత, స్వదేశీ భావన, పర్యావరణ పరిరక్షణ, పౌర భాధ్యత పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళా వక్త గుత్తుకొండ రామాదేవి మాట్లాడుతూ మహిళలు సంస్కృతి సంప్రదాయం కాపాడాలని కుటుంబ విలువలను గౌరవించాలన్నారు. బాలబాలికలను దేశభక్తి భావాన్ని పెంపోదించాలన్నారు. అనంతరం పూజారులచే నిర్వహించిన హోమంలో భక్తులు పాల్గొ న్నారు. కార్యక్రమానికి ముందు వివిధ గ్రామాలకు నుండి వచ్చిన హిందూ భాందవులు కోలాటాలతో ఊరేగింపుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవహా గుత్తికొండ రాజశేఖర్ జీ, రామడుగు ఖండ కార్యవహా డబుల్ కార్ ప్రవీణ్, లింగాచారి, సమితి కార్యకర్తలు వివిధ గ్రామాల సర్పంచ్లు కళ్యాణ్ దూలం కల్యాణ్, గ్రామాల ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రూ.కోటితో 17 ఓపెన్ జిమ్ ల ఏర్పాటు

## -దుర్శేడు, కిసాన్ నగర్ లో ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్, మే 5:(నేటినిజం ప్రతినిధి) ప్రధానమంత్రి నరేంద్రమోదీ "ఫిట్ ఇండియా' నినాదాన్ని పురష్కరించుకుని కరీంనగర్ ప్రజలకు ఓపెన్ జిమ్ లు అందుబాటులోకి వచ్చాయి. దాదాపు కోటి రూపాయల వ్యయంతో 17 డివిజన్లలో ఓపెన్ జిమ్ లను ఏర్పాటవుతున్నాయి. నాల్కో సంస్థ అందిస్తున్న సీఎస్సార్ నిధుల సహకారంతో మలయప్ప ఫౌండేషన్ నిర్వాహకులు ఈ ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేస్తున్నరు. అందులో భాగంగా మంగళవారం నగరంలోని కిసాన్ నగర్ అంబేద్కర్ యూత్ క్లబ్ సమీపంలో, దుర్శేడులో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఓపెన్ జిమ్ లను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప, స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆయా ఓపెన్ జిమ్ లను కేంద్ర మంత్రి ప్రారంభించారు. కేంద్ర మంత్రి సహకారంతో పూర్తిగా ప్రైవేట్ సంస్థలు అందిస్తున్న సీఎస్సార్ నిధులతోనే ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేసినట్లు మలయప్ప ఫౌండేషన్ డైరెక్టర్లు డాక్టర్ గడ్డం అరుంజయ్, గడ్డం అనూష తెలిపారు. నిత్యం ఉరుకులు పరుగులతో ఉద్యోగాల్లో బిజీగా ఉంటూ శారీరక ఫిట్ నెస్ ను కోల్పోతున్న వారికి ఈ ఓపెన్ జిమ్ లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కరీంనగరలో మొత్తం 17 డివిజన్లలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. కరీంనగర్ ప్రజలంతా ఈ ఓపెన్ జిమ్ లను ఉపయోగించుకుని శారీరక ధ్రుఢత్వాన్ని పెంచుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచించారు. అంతకుముందు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కొత్తపల్లి మండలంలోని కమాన్ పూర్ గ్రామంలో రూ.20 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద గత ఆరేళ్లుగా వందల కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్లు చెప్పారు.



# సీబీఐ డ్రామాలతో మోదీ సభ డైవర్ట్ ప్రయత్నం

## - వడ్ల కొనుగోళ్లలో ఆలస్యం
## - కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కరీంనగర్, మే 5:(నేటినిజం ప్రతినిధి) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభపై జరుగుతున్న చర్చను మళ్లించేందుకే సీబీఐ విచారణ పేరుతో డ్రామాలు ఆడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయాన్ని ప్రజల దృష్టికి రాకుండా చేయడమే లక్ష్యమని అన్నారు. కరీంనగర్ జిల్లా ఖాజీపూర్ వద్ద కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, రైతుల సమస్యలను పరిశీలించారు. మండుటెండలో రోజులు గడుస్తున్నా వడ్ల కొనుగోళ్లు జరగకపోవడం, తాలు?తరుగు పేరుతో కటింగ్‌లు, టోకెన్ల కోసం దళారుల కమీషన్లు వంటి సమస్యలపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో రైతుకు రూ.20 వేల వరకు నష్టం వస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బండి సంజయ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వెంటనే యుద్ధ ప్రాతిపదికన వడ్ల కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లింపుల్లో వైఫల్యం, కేంద్రం ఇచ్చిన నిధులను వినియోగించలేకపోవడంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పుబట్టారు. మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతులకు న్యాయం జరిగేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి హెచ్చరించారు.



# జూలూరుపాడు సహకార సంఘం చైర్మన్‌గా పాండురంగారావు

ఖమ్మం, మే 5: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రం లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా కొమ్మినేని పాండురంగారావు మంగళవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు తీర్పు మేరకు ఇప్పటి వరకు పర్సనల్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించిన శ్రీనివాసరావు నుండి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్లు చైర్మన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం చైర్మన్ పాండురంగారావు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని ఆకాంక్షించారు. సహకార సంఘం ద్వారా రైతులకు అందించే సేవలను మరింత చేరువ చేస్తామని, ముఖ్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతు పక్షపాతిగా వ్యవహరిస్తూ వారికి సకాలంలో ఎరువులు, విత్తనాలు అందేలా ముందస్తు ప్రణాళికలతో పని చేస్తామని పేర్కొన్నారు.

# వేములవాడ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక పూర్తి

## - నలుగురిని కో-ఆప్షన్ సభ్యులుగా ప్రకటించిన ఆది శ్రీనివాస్




రాజన్న సిరిసిల్ల, మే 5: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో కో-ఆప్షన్ సభ్యుల జాబితాను తెలంగాణ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రకటించారు. మున్సిపల్ కౌన్సిల్‌లో ఖాళీగా ఉన్న నాలుగు స్థానాలకు కట్కూరి శ్రీనివాస్, ఫీర్ మహమ్మద్, దుర్గం విజయ పర్శరాము, తుమ్మ జ్యోతి ఇన్నారెడ్డిలను కో-ఆప్షన్ సభ్యులుగా నియమించారు. ఈ ఎంపిక ప్రక్రియ ఉత్కంఠభరితంగా సాగి, చివరకు పార్టీ అధిష్టానం అధికారికంగా పేర్లను ఖరారు చేయడంతో ముగిసింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆది శ్రీనివాస్ హాజరై ఎంపికైన సభ్యుల పేర్లను ప్రకటించారు. పార్టీకి క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్న సీనియర్ నాయకులకు ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఎంపికైన సభ్యులకు పార్టీ నేతలు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నియామకాలతో వేములవాడ మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతాయని స్థానిక నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో బాలికల సాధికారిత వర్క్‌షాప్ ప్రారంభోత్సవం

రాజన్న సిరిసిల్ల, మే 5:(నేటినిజం ప్రతినిధి): బాలికల సాధికారిత ధ్యేయంగా ఎన్టీపీసీ యాజమాన్యం ఎన్టీపీసీ ప్రభావిత గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో చదివిని విద్యార్థులకు ఎన్టీపీసీ గర్ల్స్ ఎంపైర్మెంట్ మిషన్ పేరిట ప్రతీ ఏడాది వేసవి కాలంలో ఉచితంగా అందిస్తున్న బాలికల సాధికారత వర్క్‌షాప్ ఈ ఏడాది 2026కు కూడా ఎన్టీపీసీ యాజమాన్యం ప్రారంభోత్సవం నిర్వహించారు.

ఈ మేరకు మంగళవారం ఎన్టీపీసీ టౌన్‌షిప్లోని కాకతీయ ఫంక్షన్హాల్లో వర్క్‌షాప్ శిక్షణను ఎన్టీపీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ చందన్కుమార్ సమంత, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సమంత ముఖ్యఅతిథిగా పాల్గొని వర్క్‌షాప్ను ప్రారంభోత్సవం చేశారు. అనంతరం శిక్షణ బాలికలకు స్టడీ కిట్లు, యూనిఫామ్స్ అందజేశారు.




# సూరారం పీఎస్ పరిధిలో ఆరు నెలల బాలిక కిడ్నాప్

నల్గొండ, మే 5: సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో 6నెలల బాలిక కిడ్నాప్ గురైంది. తల్లితో కలిసి రోడ్డు పక్కన నిద్రిస్తుండగా బైక్ పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని దుండుగులు బాలికను ఎత్తుకెళ్లిపోయారు. సూరారం మల్లారెడ్డి దవాఖాన ఎదురుగా ఉన్న మార్బుల్ షాప్ ముందు సోమవారం రాత్రి తల్లితో కలిసి నిద్రిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. తల్లి ఆశ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com